




ర్యాగ్యాంగ్‌లు

- ఐదేళ్ల అలసత్వం.. రెచ్చిపోతున్న విద్యార్థులు
- తూతూ మంత్రంగా పోలీసుల పర్యవేక్షణ
- గత ప్రభుత్వం నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం
- నర్సరావుపేట సంఘటనతో తల్లిదండ్రుల్లో కలవరం

- పురివిప్పుతున్న ర్యాగింగ్ భూతం

ఒకప్పుడు విద్యాసంస్థల్లో ర్యాగింగ్ చేయాలనే ఆలోచన వస్తేనే సీనియర్లు హడలిపోయేవారు....కొత్త విద్యాసంత్సరం ప్రారంభం కాగానే పోలీసు ఉన్నతాధికారులు ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యక్షం అయ్యేవారు..విద్యార్థుల హాస్టల్స్, బస్సుల్లో ర్యాగింగ్ వల్ల ఎదురయ్యే సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించేవారు..ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తు విస్తృత స్థాయిలో సదస్సులు నిర్వహించేవారు..ప్రతి కళాశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యాజమాన్యాలతో ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు అయ్యేవి.. ర్యాగింగ్ భూతంపై ఉక్కుపాదం మోపడంతో పాటు కఠిన శిక్షలు అమల చేసేవారు..ఇందుకు యాజమాన్యాలు తమవంతు సహకారం అందించేవి.





నరసరావుపేటలో విద్యార్థులను కర్రలతో కొడుతున్న సీనియర్ విద్యార్థులు

గుంటూరు(విద్య), జూలై 24: ఐదేళ్ళ క్రితం వచ్చిన జగన్ ప్రభుత్వంలో కళాశాలల్లో ర్యాగింగ్ కమిటీ లు దాదాపు నిర్వీర్యం అయ్యాయి. ప్రతిపక్ష పార్టీ నాయకుల వేధింపులకే పరిమిత మైన పోలీసు వ్యవస్థ విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌పై నిర్లక్ష్యం వహించారు. తూతూ మంత్రంగా సమావేశాలు ఏర్పాటు చేయడంతోపాటు కళాశాలలపై నిఘా పూర్తి స్థాయిలో తగ్గిపోయింది. ఫలితంగా కళాశాలల్లో ర్యాగింగ్ భూతం చాపకింద నీరులా విస్తృతం అయింది. కొత్త విద్యార్థుల పాలిట ర్యాగింగ్ శాపంగా మారింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో నర్స రావుపేటలోని ఓ కళాశాల హాస్టల్ లో జూనియర్ విద్యార్థి పట్ల సీనియర్ విద్యార్థులు ప్రవర్తించిన తీరు విద్యార్థులు, తల్లిదండ్రుల్ని ఉలిక్కిపడేలా చేసింది. జూనియర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు కర్రలతో దాడిచేస్తూ మానవతకే మచ్చ తెచ్చేలా వ్యవహరించిన తీరు సామాజిక మాధ్య మాల్లో వైరల్ అయింది.

ఇదీ ఉమ్మడి జిల్లా స్వరూపం..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ యూనిర్సిటీ, ప్రఖ్యాత డీమ్డ్ యూనివర్శిటీలు, ఇంజనీరింగ్, మెడిసిన్, నర్శింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలలు దాదాపు 100పైగానే ఉన్నాయి. ఆయా విద్యాసంస్థల్లో దాదాపు 1.20లక్షల మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాదాపు అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు జిల్లాలో విద్యాను అభ్యసిస్తున్నారు. ఈనేపథ్యంలో నూతన ప్రభుత్వం ర్యాగింగ్‌పై విస్తృత చర్యలు తీసుకోవాల్సి ఉంది. ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేసి, పోలీసుల ఆధ్వర్యంలో అంతర్గతంగా పర్యవేక్షణ చేయాల్సి ఉంది. ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసి,పోలీసుల నంబర్స్ కళాశాల్లో అన్ని ప్రాంతాల్లోని నోటీసు బోర్డుల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ఈ అయిదేళ్ళలోఎక్కడా ఇటువంటి చర్యలు తీసుకున్న దాఖాలు లేవు.కొన్ని చోట్లు తూతూ మంత్రంగానే సమావేశాలు నిర్వహించారని, ఇందులో తల్లిదండ్రుల్ని భాగస్వాములు చేయడం లేదు. ఫలితంగా ర్యాగింగ్ చాపకింద నీరులా విద్యాసంస్థల్లో విస్తరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి.

ర్యాగింగ్‌కు పాల్పడితే..ఇవీ శిక్షలు

విద్యార్థులను అసభ్య పదాలతో ధూషించడం...వారి పట్ల అవమానకరంగా ప్రవర్తించడం వంటి నేరాలకు ఆరునెలలు జైలు శిక్షతోపాటు, జరిమానా విధిస్తారు...ఒక్కోసారి రెండూ అమలు చేయవచ్చు.

- ర్యాగింగ్ పేరుతో విద్యార్థుల్ని గాయపర్చడం,అసభ్యకరంగా ప్రవర్తించేలా చేయడం.. వారి పట్ల క్రూరంగా వ్యవహారించడం చేస్తే సంవత్సరం వరకు జైలుశిక్షణ, జరినామా విధిస్తారు. ర్యాగింగ్ చేస్తూ పట్టుబడినా, ర్యాగింగ్‌చేసినట్లు రుజువైనా ఒక్కోసారి అయిదు సంవత్సరాల పాటు జైలుశిక్ష, జరిమానా విధించడంతోపాటు విద్యార్థి ఏ విద్యాసంస్థలో కూడా చదకుండా టీసీపై రిమార్కువేస్తారు. అంతేకాదు అప్పటి వరకు సదరు విద్యార్థిపై ప్రభుత్వం వెచ్చించిన ఖర్చు వసూలు చేయడంతోపాటు, కళాశాల నుంచి పూర్తిస్థాయిలో డీబార్ చేస్తారు. ఇదీ కనీసం రెండు సంవత్సరాలు లేదా ఒక్కోసారి విద్యార్థి జీవితకాలం అమలు అయ్యే అవకాశం ఉంది.. ఇప్పటికే ఇంటర్ విద్యాసంత్సరంతోపాటు ఇంజనీరింగ్ కళాశాలలు ప్రారంభం అయ్యాయి. కొద్దిరోజుల్లో అన్ని విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలు విస్తృతం చేయనున్నాయి. ఈనేపథ్యంలో జూనియర్ విద్యార్థుల్ని సీనియర్స్ ర్యాగింగ్ చేయడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాల్సి ఉంది.
- విద్యార్థుల ప్రయాణించే బస్సుల్లో, హాస్టల్స్‌లో, విద్యార్థులు బస చేసే ప్రైవేటు హాస్టల్ గదుల్లో విస్తృత పర్యవేక్షణ, అకస్మిక తనిఖీలు చేయడం పాటు ర్యాగింగ్‌ను అరికట్టడానికి కళాశాలల యాజమాన్యాలకు నిర్దిష్టమైన దిశానిర్దేశం చేయాల్సి ఉంది.

అమృత్‌తో.. అద్భుతంగా..

- రైల్వేస్టేషన్లలో అంతర్జాతీయ ప్రమాణాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 12 స్టేషన్ల ఎంపిక
- రైల్వే బడ్జెట్‌లో పొందుపరిచిన కేంద్ర ప్రభుత్వం

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అత్యాధునికంగా.. అంతర్జాతీయ స్థాయిలో.. అద్భుతంగా.. ప్రయాణికులకు కొత్త అనుభూతి కలిగించేలా రైల్వే స్టేషన్లు అభివృద్ధి చెందనున్నాయి. కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రకటించిన రైల్వేబడ్జెట్‌లో అమృత్ రైల్వేస్టేషన్లు, ప్రయాణికుల సౌకర్యాలకు అగ్ర తాంబూలం ఇచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 12 రైల్వేస్టేషన్లను అమృత్ రైల్వేస్టేషన్లుగా ఎంపిక చేసింది. కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమికి చెందిన డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు ఉండటంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు భారీగానే మేలు జరుగుతోన్నది. ఇప్పటికే అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్ల ఆర్థిక సాయాన్ని ఇప్పించనున్నట్లు ప్రకటించి న కేంద్ర ప్రభుత్వం రైల్వేకు కూడా ఆశాజనకంగా నిధులు కేటాయించింది. ముఖ్యంగా ప్రయాణికుల సదుపాయాలకు పెద్దపీట వేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 12 రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్ ప్రాజెక్టుకి ఎంపిక చేసింది. దీంతో ఆయా స్టేషన్లకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నది. గతంలో ఎన్నడూ లేని విధంగా రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నది. ఇప్పటికే చేపట్టిన వివిధ రకాల పనులతో స్టేషన్ల ముఖచిత్రాలే సమూలంగా మారిపోయాయి. ముఖ్యంగా స్టేషన్ బిల్డింగ్, సర్క్యులేటింగ్ ఏరియా, టిక్కెట్ కౌంటర్లు, ఫుట్ బ్రిడ్జీలు, ఎస్కలేటర్లు, లిఫ్టులతో ప్రయాణికులకు వాటిని సౌకర్యవంతంగా మార్చింది. తాజాగా కేంద్ర బడ్జెట్‌లో బాపట్ల, చీరాల, గుంటూరు, మాచర్ల, మంగళగిరి, నడికుడి, నరసరావుపేట, పిడుగురాళ్ల, రేపల్లె, సత్తెనపల్లి, తెనాలి, వినుకొండ రైల్వేస్టేషన్లను అమృత్ పథకం కింద ఎంపిక చేసినట్లు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రకటించారు. ఇక గుంటూరు డివిజన్ పరిధిలో కంభం, దొనకొండ, గిద్దలూరు, మార్కాపురం రోడ్డు, నంద్యాల రైల్వే స్టేషన్లు కూడా ఉన్నాయి. దీంతో ఆయా స్టేషన్ల రూపురేఖలు మారిపోనున్నాయి. కాగా గతంలో పైన పేర్కొన్న రైల్వేస్టేషన్లలో చాలా వాటికి ఒకవైపు మాత్రమే ప్రవేశానికి అనుమతి ఉండేది. దీంతో ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు చేరుకోవడానికి చుట్టూత తిరిగి రావాల్సి వచ్చేది. అమృత్ స్టేషన్ కింద వీటికి రెండు వైపులా భవనాలు నిర్మించడం వల్ల సులభతరంగా స్టేషన్ లోకి చేరుకోవచ్చు. వైఫై కియోస్కులు ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తారు. కొన్ని రైల్వేస్టేషన్లలో ఫుడ్‌కోర్టులు వంటివి కూడా ఏర్పాటు చేసి సిటీ సెంటర్లుగా మారుస్తారు. ఆయా సదుపాయాల వల్ల ప్రయాణికులకు స్టేషన్‌లోకి ప్రవేశించగానే కొత్త అనుభూతి కలుగుతుంది.

మత్తులో.. వీరంగం



- విచ్చలవిడిగా లభిస్తోన్న గంజాయి
- ఆ మత్తులో చెలరేగిపోతున్న యువతరం
- తాజాగా అమృతలూరులో పోలీసులపైనే దాడి యత్నం
- గుంటూరు శివార్లలో గంజాయి మత్తులో విద్యార్థులు
- సెబ్ దాడి.. పట్టుబడిన ఇద్దరు.. ఒకరు ఎక్సైజ్ కానిస్టేబుల్ తనయుడు

చదువుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాల్సిన విద్యార్థులు, పనులతో జీవనం సాగించుకోవాల్సిన యువత గంజాయి మత్తుకు బలవుతుంది. విచక్షణ మరిచి తామేమి చేస్తున్నామో కూడా తెలియనట్లుగా వ్యవహరిస్తోంది. గంజాయి కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోలీసులు చేస్తున్న ప్రకటనలు ఎక్కడా కనిపించడంలేదు. విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి మత్తులో విద్యార్థులు, యువకులు చెలరేగి పోతున్న ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. తాజాగా అమృతలూరులో కొందరు యువకులు గంజాయి, మద్యం మత్తులో ఓ ఆర్టీసీ బస్సు ఎక్కి అద్దాలు పగులగొట్టి ప్రయాణికులు, పోలీసులపై దాడికి దిగారు. ఇక గుంటూరు శివార్లలో కళాశాల వేళల్లో కొంద రు విద్యార్థులు మూకుమ్మడిగా గంజాయి మత్తులో జోగుతూ ఉండటం చూసి సెబ్ అధికారులే విస్తుపోయారు.

గుంటూరు, జూలై 24: అమృతలూరులో బుధవారం చోటుచేసుకున్న ఘటన స్థానికంగా భయాందోళనలు సృష్టించింది. గంజాయి, మద్యం మత్తులో గ్రామానికి చెందిన సంకే యశ్వంత్, కంచర్ల శరత్, ఆసోది సతీష్‌రెడ్డి అనే యువకులు ఆర్టీసీ బస్సు, పోలీసు వాహనంపై కూడా దాడికి పాల్పడ్డారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థులను ఎక్కించుకునే నిమిత్తం తెనాలి నుంచి పొన్నూరు వెళ్లతున్న ఆర్టీసీ బస్సు నిలిచి ఉంది. ఈ క్రమంలో యశ్వంత్ అనే యువకుడు బస్సులో ప్రవేశించి విద్యార్థులు, ప్రయాణికులపై దౌర్జన్యం చేశాడు. బస్సును నడుపుతా అంటూ డ్రైవర్‌ను పక్కకు నెట్టే ప్రయత్నం చేశాడు. అయితే డ్రైవర్ చాకచక్యంగా తాళాలు తీసుకోగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ యశ్వంత్ బస్సు అద్దాన్ని పగలగొట్టాడు. బస్సులో ప్రయాణిస్తున్న మహిళా పోలీసు వెంటనే ఎస్‌ఐ నవీన్‌కుమార్ సమాచారం అందించగా ఆయన మరికొంత సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. ఎస్‌ఐ, సిబ్బంది మత్తులో ఉన్న యువకులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో మరింత రెచ్చిపోయిన యువకులు నానా దుర్భాషలాడుతూ, పోలీసులపై దురుసుగా ప్రయత్నించారు. వారిని తీసుకువెళ్లేందుకు తీసుకువచ్చిన వాహనం అద్దాలు కూడా పగలగొట్టారు. దీంతో స్థానికులు మరింత భయాందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బస్సు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయికి అడ్డాగా మారిందా

అమృతలూరు, పెదపూడి, యలవర్రు, పాంచాళవరం గ్రామాల్లో విచ్చలవిడిగా గంజాయి అందుబాటులో ఉంటుందని స్థానికులు తెలిపారు. గంజాయి, మద్యం మత్తులో ఏమి చేస్తున్నారో కూడా తెలియకుండా కొందరు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ ఘటన కూడా ఆ కోవకు చెందినదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు జరిగినా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి గ్రామాల్లో గంజాయితో పాటు, మద్యం బెల్టు షాపుల ద్వారా ఏరులై పారుతుందన్న విషయం తెలిసిందే. ఇకనైనా పోలీసులు ప్రేక్షక పాత్ర వదిలి కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సెబ్ దాడి.. మత్తులో విద్యార్థులు

అద్దాలు పగిలిన ఆర్టీసీ బస్సు

గుంటూరు(కార్పొరేషన్): ఇంజనీరింగ్ విద్యార్థులు కొం దరు గుంటూరు నగర శివారు జాతీయ రహదారి ఆనుకుని ఉన్న బొంతపాడు గ్రామ సమీపంలో మూకుమ్మడిగా మత్తు మందు తీసుకుంటున్నారు. ఈ విషయం సెబ్ అధికారులకు సమాచారం అందింది. దీంతో సెబ్ అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు విద్యార్థులు పట్టుబడగా మరి కొంత మంది విద్యార్థులు పరారయ్యారు. ఆ ఇద్దర్ని విచారించగా ఒకరు పల్నాడు జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కుమారుడని తేలింది. విద్యార్థుల వద్ద ఉన్న మత్తు మందును స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులకు మత్తు మందు ఎక్కడి నుంచి వస్తుందనే సమాచారాన్ని సెబ్ ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేస్తున్నారు.

ఏరివేతకు కసరత్తు

- నకిలీ పింఛన్లపై అధికారుల దృష్టి
- గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అనర్హులకు లబ్ధి
- అర్హులైన వారికి మొండిచెయ్యి



బాపట్ల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్ల మంజూరు విషయంలోనూ గత ప్రభుత్వంలో నేతలు అనేక అవకతవకలకు పాల్పడినట్లు తెలుస్తోంది. వైసీపీ నేతలు తమ విధేయులకు అర్హత లేకపోయినా లబ్ధిదారుల జాబితాలో చేర్చి వారికి ఆయాచిత మేలు చేకూర్చారు. ఇందుకోసం అధికారుల మీద తీవ్ర స్థాయిలో రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి తమ పబ్బం గడుపుకున్నారు. నిబంధనల ప్రకారం అన్ని అర్హతల ఉన్న వేలమం దిని రకరకాల కారణాలతో పింఛన్‌కు దూరం చేశారు.

కొత్త ప్రభుత్వం కొలువుదీరగానే అనర్హుల ఏరివేతపై దృష్టిసారించింది. ఇందుకు సంబంధించి జిల్లాల్లో డీఆర్‌డీఏ అధికారులు క్షేత్ర స్థాయిలో ముమ్మర కసరత్తు చేస్తున్నారు. అనర్హులను ఏరివేయడం ఎంత ముఖ్యమో అర్హులకు పింఛన్ అందించడం కూడా అంతే ముఖ్యమన్న దృక్పథంతో అధికారులు పనిచేయాలనే స్పష్టమైన ఆదేశాలను ప్రభుత్వం ఇచ్చింది.

బాపట్ల జిల్లాలోనే దాదాపు 5,500 మంది...

అనర్హుల ఏరివేతలో భాగంగా కసరత్తు చేస్తున్న అధికారులు ఒక్క బాపట్ల జిల్లాలోనే దాదాపు 5,500 మంది అర్హత లేకపోయినా సామాజిక పింఛన్ తీసుకుంటున్నారని ఒక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ సంఖ్య దాదాపు 15,000 మందికి పైగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పింఛన్ల విచారణ ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చింది. ఇదే సమయంలో అన్ని అర్హతలు ఉండడంతో పాటు రాజకీయ కారణాలతో పింఛన్ అందని వారు బాపట్ల జిల్లాలోనే 3,000 మందిని గుర్తించిన అధికారులు ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే అర్హతలు ఉండి పింఛన్ అందని వారిసంఖ్య పదివేల మంది వరకు ఉండొచ్చని తెలుస్తోంది.

సామాజిక పింఛన్ విషయంలో..



నిబంధనల ప్రకారం అర్హులకు మాత్రమే దక్కాల్సిన సామాజిక పింఛన్ విషయంలో కూడా వైసీపీ రాజకీ యాలకు పాల్పడడం విస్మయపరుస్తోంది. వైసీపీ నేతల తైనాతీలకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చిన గత ప్రభుత్వం అర్హులను మాత్రం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుని మొండి చెయ్యి చూపించింది. గ్రామాలలో టీడీపీ సానుభూతి పరులన్న ఒకేఒక్క కారణంతో అన్ని అర్హతలున్నప్పటికీ ఏదో ఒక కొర్రీవేసి పింఛన్‌కు దూరం చేశారు. ఈ మొత్తం అవకతవకలలో కొంత మంది అధికారులు కూడా అత్యుత్సాహం ప్రదర్శించారన్న విమర్శ ఉంది. అనర్హులకు సదరం సర్టిఫికెట్ల జారీ విషయంలో డాక్టర్ల పాత్రపై విచారణ జరపాలనే డిమాండ్లు పెద్ద ఎత్తున వస్తున్నాయి.

మరింత మందికి లబ్ధి...

కొత్త ప్రభుత్వం అనర్హుల పింఛన్ ఏరివేతపై దృష్టిపెట్టడంతో పాటు అర్హులకు జరిగిన అన్యాయంపై అదేస్థాయిలో స్పందించడం పట్ల వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరించడంతో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వంలో పింఛన్‌కు దూరమయ్యామని, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న కసరత్తు వల తమకు న్యాయం జరగనుందనే అభిప్రాయాన్ని దరఖాస్తుదారులు వ్యక్తం చేస్తున్నారు. అనర్హులకు అందుతున్న పింఛన్‌ను తీవ్రంగా పరిగణించి తొలగించాలని, అవసరమైతే వారి దగ్గర నుంచి రికవరీ చేసే విషయాన్ని కూడా పరిగణించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

వైసీపీ నేతలు చెప్పిన వారికే..

దివ్యాంగుల ధ్రువీకరణలో గత ప్రభుత్వంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. వైసీపీ నేతలు చెప్పినవారికే సదరం సర్టిఫికెట్లు మంజూరు అయ్యాయి. ఈ వ్యవహారంలో గత ప్రభుత్వం పెద్ద ఎత్తున అధికార దుర్వినియోగానికి పాల్పడ్డట్లు ఆరోపణలున్నాయి. అనర్హుల జాబితాలో ఎక్కువ శాతం మంది దివ్యాంగుల కోటా కిందే లబ్ధి పొందారు. ఇదే కాకుండా గ్రామాల్లో వైసీపీ నేతల అనుచరులకు అర్హత లేకపోయినా పదవిని ఉపయోగించి పింఛన్ అందేలా చేశారు. భర్తలుండి ఒంటరి మహిళ పింఛన్ పొందుతున్న వారు, తప్పుడు వయసు ధ్రువీకరణతో లబ్ధి పొందడంతో పాటు కులవృత్తుల వారికే ఇచ్చే పింఛన్ సైతం వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించి అర్హుల నోట్లో మట్టి కొట్టింది. కిడ్నీబాధితులు, డప్పు కళాకారుల విషయంలో అర్హులకు కాకుండా బోగస్ వారికే పింఛన్లు అందుతున్నట్లు క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు గుర్తించారు. ఇక చేనేత పింఛన్ విషయంలో పేర్లు మార్చి మరీ గోల్‌మాల్ చేసినట్లు చీరాల పరిధిలో అధికారుల దృష్టికి వచ్చింది

కొమ్ముకాసిన అధికారుల్లో వణుకు..

పింఛన్ల వడపోతపై క్షేత్రస్థాయిలో ముమ్మరంగా కసరత్తు జరుగుతున్న నేపథ్యంలో వైసీపీ నేతలు చెప్పినట్టు అలా తలాడించిన అధికారుల్లో వణుకు మొదలైంది. కొంతమంది అధికారులు ఒత్తిళ్లతో నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే, వైసీపీ ప్రాపకంతో పోస్టింగ్ తెచ్చుకున్న వారయితే వారి సేవలో తరించి ఎంతో మంది అనర్హులకు పిం ఛన్ అందడంలో వారి సహకాంరం అందించారు. టీడీపీ ద్వితీయశ్రేణి నేతలు ఎన్నోసార్లు వారి చుట్టూ తిరిగి అర్హతలున్న పింఛన్ అందని వారి జాబితాను అందించినప్పటికీ దానిని చెత్తబుట్టలో పడేసి వైసీపీ పై వీర విధేయత నిరూపించు కున్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి వారందరి కుర్చీలు కదలడం ఖాయంగా కనిపిస్తోంది.

వలంటీర్ల పాత్రకూడా కీలకమే...

అనర్హులు భారీ సంఖ్యలో పింఛన్ అందుకుంటున్న వారి జాబితాలో ఉండడం వెనక వలంటీర్లు కూడా కీలకంగా పనిచేశారు. దరఖాస్తుల లాగిన్ వారికే ఇవ్వడంతో వైసీపీ నేతలతో కుమ్మక్కయి పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో అర్హులను లబ్ధిదారులుగా చేర్చడానికి కూడా పెద్ద ఎత్తున డబ్బును డిమాండ్‌చేసి ఆ సొమ్మును వైసీపీ నేతలు, వలంటీర్లు పంచుకున్నారని లబ్ధిదారులు చెబుతున్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ జరిపించి అవకతవకలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు ఊపందుకుంటున్నాయి

తహసీల్దార్ల రిలీవింగ్‌లో జాప్యం

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల కోసం వచ్చిన తహసీల్దార్లను వారి సొంత జిల్లాలకు రిలీవింగ్ చేసే విషయంలో జాప్యం జరుగుతోన్నది. ఇప్పటికే ఈ విషయంలో సీసీఎల్‌ఏ ఉత్తర్వులు జారీ చేయగా గుంటూరు జిల్లాలో ఇంకా అమలుకు నోచుకోలేదు. పక్కన ఉన్న బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ఇప్పటికే తహసీల్దార్లను రిలీవింగ్ చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి కూడా రిలీవింగ్ చేస్తే ఇక్కడి నుంచి నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో విధులు నిర్వహించేందుకు వెళ్లిన వారంతా తిరిగి వస్తారు. వారికి అప్పుడు గతంలో పని చేసిన మండలాలు కాకుండే వేరే వాటిల్లో పోస్టింగ్ చేసే అవకాశం ఉంటుంది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న దృష్ట్యా ప్రొటోకాల్ తదితర బాధ్యతల నిర్వహణ కోసం ఏమైనా రిలీవింగ్ చేయకుండా నిలుపుదల చేశారా అని రెవెన్యూవర్గాలు చర్చించుకుంటున్నాయి. ఇదిలావుంటే ఎన్నికల విధుల కోసం ప్రకాశం, నెల్లూరు నుంచి వచ్చి గత నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్న కొందరు సొంత జిల్లాలకు వెళ్లేందుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. అధికార పార్టీ నేతలతో సిఫార్సులు చేయించుకుని ఏదో ఒక విధంగా ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై పూర్వ గుంటూరు జిల్లా తహసీల్దార్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సీసీఎల్‌ఏ ఆదేశాల మేరకు ఎవరి జిల్లాలకు వారు వెళ్లిపోవాల్సిందేనని, లేకుంటే తాము ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ దృష్టికి తీసుకెళతామన్నారు.

అమరావతి నిర్మాణాలపై.. అధ్యయనం

- పిల్లర్ల నాణ్యత తనిఖీ బాధ్యతలు చెన్నై ఐఐటీకి
- భవనాల పటిష్ఠతపై హైదరాబాద్ ఐఐటీ నిపుణులు
- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో గతంలో నిర్మిం చిన నిర్మాణాల పటిష్ఠత ప్రస్తుతం ఎలా ఉందన్న అంశంపై ఐఐటీలకు చెం దిన నిపుణులతో అధ్యయనం చేయిస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ తెలిపారు. బుధవారం ఆయన అసెంబ్లీ ఆవరణలో 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు నూతన భవనాల కోసం రికార్డు స్థాయిలో వేసిన కాంక్రీట్ పునాది వైసీపీ నిర్వాకంతో ఈ ఐదేళ్లూ నీళ్లలో నానుతూ ఉండిపోయాయి. మేం చేయించిన అధ్యయ నం ప్రకారం కాంక్రీట్ పునాది చెక్కుచెదరలేదు. కానీ దానిపైన వేసిన పిల్లర్ల నాణ్యత ఎలా ఉంద న్నది మరోసారి తనిఖీ చేయించాలని భావించాం. ఆ పనిని చెన్నై ఐఐటీకి అప్పగించాం. అలాగే వివిధ రకాల నివాస భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. వాటి పటిష్ఠతను పరీక్షించే పనిని హైదరాబాద్ ఐఐటీ నిపుణులకు అప్పగించాం. వారి నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి కార్యాచరణ చేపడతాం' అని మంత్రి తెలిపారు. రాజధాని నిర్మాణాల కోసం టీడీపీ ప్రభుత్వం టెండర్ల ద్వారా అప్పగించిన పనులు మధ్యలో నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేయడానికి మళ్లీ కొత్తగా టెండర్లు పిలవాలని నిర్ణయించామని చెప్పారు. 'కృష్ణానది కరకట్ట పక్కన నిర్మిస్తున్న సీడ్ యాక్సెస్ రోడ్డు మరికొంత భాగం పూర్తి చేయాల్సి ఉంది. రైతుల నుంచి భూమి సేకరించాల్సి ఉంది. దీనితో పాటు మరో రెండు రోడ్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ రెండు రోడ్లు మంగళగిరి సమీపంలోని ఎయిమ్స్ ఆస్పత్రికి రెండువైపులా వస్తాయి. అక్కడ నుంచి చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారితో అనుసంధానం అవుతాయి. సీడ్ యాక్సెస్ రహదారి మాదిరిగా ఇవి కూడా విశాలమైన రోడ్లుగా వస్తాయి. దీనికి ప్రణాళికలు తయారు చేస్తున్నాం' అని మంత్రి నారాయణ తెలిపారు.



ప్యారిస్ వేదికగా శుక్రవారం నుంచి ఒలింపిక్స్ జరుగుతున్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా లండన్ చేరుకున్నారు. అక్కడున్న హైడ్ పార్క్‌లో రామ్‌చరణ్, ఉపాసన, మనవరాలు క్లీంకారాతో ప్రకృతిని ఆస్వాదిస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గురువారం మెగా కుటుంబం పారిస్ వెళుతుంది.

హీరోగా రాజ్‌తరుణ్ అందుకే



రాజ్‌తరుణ్, హాసిని జంటగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకత్వంలో డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్‌భీమన, నిర్మాత డా.రమేశ్ తేజావత్, హీరోయిన్ హాసిని మీడియాతో ముచ్చటించారు. దర్శకుడు రామ్‌భీమన మాట్లాడుతూ "మా బడ్జెట్‌కు తగ్గ హీరో కోసం అన్వేషిస్తున్న క్రమంలో రాజ్‌తరుణ్ అయితే అన్ని విధాలా బావుంటుందనిపించింది. అందుకే ఆయన్ను హీరోగా తీసుకున్నాం" అని చెప్పారు. నిర్మాత డా. రమేశ్ తేజావత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబమంతా కలసి చూసేలా సినిమాను రూపొందించాం. ప్రతీ సన్నివేశాన్ని ఎంతో క్వాలిటీతో తెరకెక్కించాము" అని తెలిపారు. హీరోయిన్ హాసిని మాట్లాడుతూ "ఇందులో నాకు, రాజ్ తరుణ్‌కు మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అద్భుతంగా ఉంది. నేను పోషించిన పాత్ర అందరికీ నచ్చుతుంది. సినిమాలో ఏడు పాటలున్నాయి. వేటికవే ప్రత్యేకంగా ఉండే ఆ పాటలు తెరపై ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి" అని చెప్పారు.

గుర్తుండిపోయే పాత్ర



సందీప్ కిషన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. తమిళ నటుడు ధనుశ్ స్వీయ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. కళానిధి మారన్ నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ధనుశ్ నటించిన 50వ చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే తగ్గట్లే ఆయన ప్రతీ విషయంలో జాగ్రత్త పడ్డారు. అద్భుతమైన స్ర్కీన్‌ప్లేతో నడిచే ఈ సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకం. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఇది. సినిమాలో యాక్షన్ మాత్రమే కాకుండా మనసుకు హత్తుకునే భావోద్వేగాలు, అందరినీ అలరించే వినోదం ఉంటుంది. ఇది 'రాయన్' అనే ఇంటిపేరు గల ఓ ఫ్యామిలీతో ముడిపడిన కథ. సినిమాలో వచ్చే ప్రతీ పోరాట ఘట్టం ప్రత్యేకంగా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు. ఏ.ఆర్. రెహమాన్ అందించిన పాటలు సినిమాకు అదనపు ఆకర్షణ" అని చెప్పారు.

అంతర్యుద్ధాన్ని ఆవిష్కరించేలా...



'పలాస 1978', 'నరకాసుర' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మీడియాతో ముచ్చటించారు.

"ఇది కొత్తతరానికి బాగా చేరువయ్యే థ్రిల్లర్. నాన్న వెంకట సత్యకు దర్శకుడిగా ఇది తొలి సినిమా అయినా ఎక్కడా తడబడలేదు. ఈ సినిమా ప్రతీ మనిషిలో జరిగే ఆలోచనల అంతర్యుద్ధాన్ని కొత్తగా ఆవిష్కరిస్తుంది. ఇందులో నేను ఆనంద్ శ్రీరామ్ అనే టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఓ విభిన్నమైన ప్రేమ కథ కూడా ఉంటుంది. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్‌గా చూపిస్తుంది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులు తమ టికెట్‌కు వంద శాతం న్యాయం జరిగిందని భావిస్తారు" అని చెప్పారు.



బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. 'బీఎస్ఎస్ 12' వర్కింగ్ టైటిల్. లుధీర్ బైరెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో కల్ట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోందని నిర్మాతలు తెలిపారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్ ఆర్.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



అనసూయ, జగపతిబాబు ప్రధాన పాత్రలు పోషించిన 'సింబా' చిత్రం ఆగస్టు 9న విడుదల కానుంది. మురళీ మనోహర్ దర్శకత్వంలో దాసిర రాజేంద్రరెడ్డి నిర్మించిన చిత్రమిది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతూ ' చాలా మంచి కాన్సెప్ట్‌తో 'సింబా' రూపుదిద్దుకుంది. జగపతిబాబు ఈ చిత్రానికి ప్రధాన బలం' అన్నారు. 'మా సినిమాకు కథే హీరో. ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోండి. ముందు తరాల గురించి ఆలోచించండి... అని చెబుతున్నాం' అన్నారు నిర్మాత రాజేందర్‌రెడ్డి. సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదనీ, ఇంతవరకూ ఇండియన్ స్ర్కీన్ మీద ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. ఈ సినిమాకు కథ, స్ర్కీన్‌ప్లే అందించిన సంపత్ నందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పాటల రేవులో సాహితీ సంగమం



మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించే ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'రేవు' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఆగస్టు రెండో వారంలో విడుదల కోసం సిద్ధమైంది. ఈ సినిమా ఆడియో వేడుక బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. ఐదుగురు ప్రముఖ గీతరచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొనడం ఒక విశేషమైతే, చాలా ఏళ్ల తర్వాత క్యాసెట్ రూపంలో ఈ ఆడియోను విడుదల చేయడం మరో విశేషం. గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ 'నవ్యత, నాణ్యత ఈ చిత్రంలో కనిపించాయి. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. 'కంటెంట్ ఉన్న వైవిధ్యమైన సినిమాలు రావాలంటే పర భాషల వైపు చూస్తుంటాం. కానీ 'రేవు' సినిమా పాటలు విన్నాక కొత్తతరం ప్రతిభావంతులపై నమ్మకం ఏర్పడుతోంది' అన్నారు రామజోగయ్య శాస్త్రి. తనలాగానే గీత రచయిత ఇమ్రాన్ శాస్త్రి మొదటి సినిమాకే సింగిల్ కార్డ్ పొందారని అనంత శ్రీరామ్ అభినందించారు. అక్షరాలన్నీ కలసినట్టుగా ఈ వేదిక ఉందని సుద్దాల అశోక్‌తేజ అభినందించారు. 'రేవు' చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు మాట్లాడుతూ 'ఒక చిన్న సినిమాను సపోర్ట్ చేయడానికి ఇంతమంది గీత రచయితలు రావడం ఆనందంగా ఉంది. దర్శకుడు హరనాథ్ మత్స్యకారుల జీవన పోరాటాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు' అని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాతలు, మిత్రులు మురళీ గింజుపల్లి,నవీన్ పారుపల్లి నా మీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలా 'రేవు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళతాం' అని చెప్పారు.

ఆగస్టులో డిమోంటీ కాలనీ 2



అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డిమోంటి కాలనీ 2'. బ్లాక్‌బస్టర్ హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌వర్మ ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తోంది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: హరీశ్ కన్నన్

చిరంజీవి పుట్టిన రోజున



బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, మోహన్ సేనాపతి కీలకపాత్రలు పోషించారు. ఆగస్టు 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేసింది. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న 'పరాక్రమం' చిత్రాన్ని విడుదల చేస్తున్నామని సరోజ్‌కుమార్ చెప్పారు.



దర్శకుడు మారుతి సమర్పణలో భారీ మ్యూజికల్ ఈవెంట్ 'జామ్‌జంక్షన్' సెప్టెంబర్ 6న హైటెక్స్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

అనాథల కథ



సంజయ్ శ్రీరాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్ మహాన్, రితిక ప్రధాన పాత్రలు పోషించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అనాథల బాధ్యత సమాజం తీసుకోకపోతే చాలా దారుణాలు ఎదుర్కోవలసి వస్తుంది అనే ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని ధర్మ దర్శకత్వంలో డాక్టర్ అరవేటి యశోవర్ధన్ నిర్మించారు. ఎన్నో అవరోధాలను అధిగమించి, చిత్రాన్ని పూర్తి చేసి విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

జగన్ దొంగ డ్రామా అట్టర్ ప్లాప్

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 24: ప్రజల దృష్టిని మళ్లించడానికి ఢిల్లీలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఆడిన డ్రామాలు, చేసిన దొంగ ధర్నా అట్టర్‌ప్లాప్‌ఐందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఎద్దేవా చేశారు. ఐదేళ్ల పాలనలో చేసిన హత్యలు, దారుణాలు, రక్తపు మరకలను అంత త్వరగా తుడి చేసుకోవడం జగన్‌కు సాధ్యం కాదన్నారు. ఈ పరిణామాలు జగన్‌కు అర్థమయ్యేలా ఢిల్లీ ధర్నాను కనీసం పట్టించుకున్న వారు కూడా ఎవ్వరూ లేరన్నారు. రాక్షస పాలనలో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడిన వ్యక్తి ప్రభుత్వం మారిన నెల వ్యవధిలో ఇలా పెడబబ్బులు పెడుతుండటం, ధర్నాలకు దిగడమంతా నాటకంగానే కన్పిస్తుందన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన మొదలు మొన్నటి ఎన్నికల్లో ఓటమి వరకు ఎంత మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఉసురు పోసుకున్నారో మరచి పోయారా? అని జగన్‌ను ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్ నుంచి అమరనాథ్‌గౌడ్ వరకు వందల ప్రాణాలు తీసిన నీచ చరిత్ర దాచి పెట్టి దొంగ ధర్నాలు చేస్తే ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు.

మద్యం అక్రమాలపై నిగ్గు తేల్చాలి

ఎక్సైజ్ శ్వేతపత్రంపై అసెంబ్లీ చర్చలో జీవీ డిమాండ్



వినుకొండ, జూలై 24: వైసీపీ ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యంతో ప్రజల ప్రాణాలు హరించి అక్రమాలకు పాల్పడిన వైనంపై నిగ్గు తేల్చాలని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బుధవారం జరిగిన ఎక్సైజ్ శ్వేతపత్రంపై జరిగిన చర్చలో జీవీ మాట్లాడారు. నాసిరకం మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి ప్రభుత్వ ఖజానాను లూటీ చేశారని మండిపడ్డారు. నాసిరకం మద్యాన్ని దిగుమతి చేసుకుని వేలాది మంది ప్రాణాలను తీసి, లక్షల మంది ప్రజల ఆరోగ్యాలు గుల్ల చేసిన జే బ్రాండ్ మద్యం కుంభకోణంపై లోతైన విచారణ జరిపించాలన్నారు. మద్యాన్ని అధిక ధరలకు విక్రయించి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడిన దుర్మార్గులను వదిలి పెట్టకూడదన్నారు. ఏ కంపెనీలకు జగన్ ప్రభుత్వ దోచి పెట్టిందో, ఆ సొమ్మును రికవరీ చెయ్యాలన్నారు. జే బ్రాండ్ నాసిరకం మద్యం వల్ల 35 ఏళ్ల వయస్సుగల యువకులు మృతి చెందడం తాను కళ్లారా చూశానని తెలిపారు.

కేసుల భయంతో వైసీపీకి కిలారి గుడ్ బై



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రోశయ్య

- జనసేనలో చేరేందుకు కొద్ది రోజులుగా ప్రయత్నాలు
- జగన్ పర్యటనకు కూడా మామా, అల్లుడు దూరం
- అప్పిరెడ్డికి కేబినెట్ హోదాపై మరింత గుర్రు
- గుంటూరు సమావేశంలో నీతి వ్యాక్యాలు వల్లె

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాజా మాజీ ఎమ్మెల్యేల్లో కెల్లా అత్యంత అవినీతి పరుడుగా అక్రమ తవ్వకాలతో కేజీఎఫ్‌గా ప్రత్యర్థులు పిలుచుకున్న మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య వైసీపీ సభ్యత్వానికి, గుంటూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా బలవంతంగా బరిలోకి దిగిన రోశయ్య ఘోర పరాజయం చవిచూసిన విషయం తెలిసిందే. ఓటమిని ముందే ఊహించిన రోశయ్య ఒకటి, రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రమే మొక్కుబడిగా పర్యటించి చేతులెత్తేశారు. ఎన్నికల కార్యాలయం పెట్టినా ఖర్చు దండగా అని భావించి కార్యాలయం కూడా ఏర్పాటు చేయలేదు. విశేషమేమిటంటే పోలింగ్ రోజున బూత్‌ల్లో ఎంపీ అభ్యర్థికి ఏజంట్లు కూడా లేకపోవడం. అధిష్ఠానం తనకు పొన్నూరు ఎమ్మెల్యే సీటు ఇవ్వకుండా బలవంతంగా ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించిందని రోశయ్య బుధవారం తన అనుయాయులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో వాపోయారు. వాస్తవానికి పొన్నూరులో ఎమ్మెల్యేగా తిరిగి పోటీ చేస్తే సొంత పార్టీ వాళ్లే ఓడిస్తారనే భయంతోనే ఆయన ఎంపీగా పోటీ చేయమనగానే ఏమాత్రం వ్యతిరేకత వ్యక్తం చేయకుండా వచ్చి పోటీ చేశారు. పరాజయం పాలైన మరుసటి రోజు నుంచి ఆయన పత్తా లేకుండా పోయారు. నాలుగు రోజుల క్రితం వినుకొండలో జరిగిన మాజీ సీఎం జగన్ కార్యక్రమానికి కూడా రోశయ్య, మామ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు డుమ్మా కొట్టారు. కాగా ఆత్మీయ సమావేశంలో రోశయ్య తానేదే పరిశుద్ధుడిని అని చాటుకుంటూ వైసీపీలో అర్హత లేని వ్యక్తులనే అందలం ఎక్కిస్తారని, పార్టీకి నష్టం చేసే వారికే ప్రమోషన్లు ఇస్తారని వ్యాఖ్యలు చేశారు. అందువల్లే ఆ పార్టీలో ఇమడలేక రాజీనామా చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. శాసన మండలిలో ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డికి ప్రతిపక్ష నేత హోదా కల్పించారనే అక్కసు కూడా ఆయన వ్యాఖ్యల్లో కనిపించింది. పరోక్షంగా తన మామ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుకి ఆ హోదా కల్పించాలనే భావన వ్యక్తమైంది. వాస్తవానికి ఉమ్మారెడ్డి ఇటీవల ఎన్నికల్లో ఎక్కడా కూడా పార్టీ అభ్యర్థుల విజయం కోసం పనిచేసిన దాఖలాలు లేవు. ఆఖరికి సొంత నియోజకవర్గమైన బాపట్లలో కూడా ఆయన పార్టీ అభ్యర్థి విజయం కోసం పనిచేయకుండా మొఖం చాటేశారు. పైగా ఆయనకు వయసు పై బడటం, ఇటీవల అనారోగ్యానికి గురవటం హుషారుగా తిరిగే పరిస్థితి కూడా లేదు. అయితే శాసన మండలిలో ప్రతిపక్ష నేతను ఎంపిక చేసే విషయంలో కనీసం తన మామ ఉమ్మారెడ్డిని ఏమాత్రం సంప్రదించకపోవటం వల్ల కూడా మనస్థాపానికి గురైనట్లు రోశయ్య ఆత్మీయుల వద్ద వాపోయారు. ఇదిలా ఉండగా వైసీపీ పరాజయం పాలైనప్పటి నుంచి ఆ పార్టీకి దూరంగా ఉంటూ జనసేనలో చేరి అధికార పార్టీ గొడుగు కిందకు చేరవచ్చని భావించి పలు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. తన వియ్యంకుడు జనసేన తరఫున ఎమ్మెల్యేగా గెలుపొంది ఉండటంతో ఆ పార్టీలో చేరవచ్చని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కూటమికి చెందిన కీలక నేతలు మాత్రం వైసీపీలో చెడ్డ పేరు తెచ్చుకున్న వారికి ఎవరికీ ఎంట్రీ ఇవ్వకూడదని ఇప్పటికే ఉమ్మడి నిర్ణయం తీసుకున్నారు. దీంతో వేరే పార్టీ నుంచి గ్రీన్‌సిగ్నల్ లేకపోయినా ఆయన వైసీపీకి రాజీనామా చేశారు. ఆ పార్టీలో కొనసాగితే అక్రమాలు వెంటాడుతాయన్న భయంతో ముందుగా ఆ పార్టీని వీడి సేఫ్ జోన్‌లో ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఇదే రీతిలో మాజీ ఎమ్మెల్యే మద్దాళి గిరి కూడా తిరిగి టీడీపీలో చేరాలని తీవ్ర ప్రయత్నాలు చేసినప్పటికీ తలుపులు తీయకపోవటంతో ప్రస్తుతం వైసీపీని వీడి రోడ్డున పడ్డాడు. స్పిన్నింగ్ వ్యాపారం భారీ స్థాయిలో చేసే గిరికి విద్యుత్ బకాయిలే కోట్లలో ఉన్నాయని, గత ప్రభుత్వంలో మాఫీ చేయించుకోవటానికి ప్రయత్నించే లోగానే వైసీపీ పరాజయం పాలైంది. వైసీపీలో ఇంకా కొనసాగితే ఆ బకాయిలను ప్రస్తుతం ప్రభుత్వం నిలబెట్టి వసూలు చేస్తుందనే భయంతోనే ఆ పార్టీకి దూరమయ్యారు. ఆ పార్టీని వీడి టీడీపీలో ప్రస్తుతం కొనసాగుతున్న కొందరు మిత్రుల ద్వారా ప్రభుత్వం నుంచి ఒత్తిడి రాకుండా ప్రయత్నం చేసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.

సచివాలయ టవర్లలో చేపల పెంపకం.. వేట!

రాజధాని పిచ్చిచెట్లవనంలో పుట్టగొడుగుల సేకరణ.. ● వైసీపీ విధ్వంస రచనతో.. రాజధాని నిర్మాణాల పరిస్థితి ఇలా..!







విజయవాడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతిపై విధ్వంసానికి తెగబడిన ఫలితానికి నిదర్శనం పై దృశ్యాలు. శాశ్వత రాజధానిగా అమరావతి నిర్మాణంలో భాగంగా ప్రధానమైన సచివాలయ టవర్లను నిర్మించే ప్రాంతం నేడు.. చేపల వేటకు కేంద్రంగా మారింది. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ స్థాయిలో సచివాలయాన్ని తీర్చిదిద్దేందుకు 40-45 అంతస్తులతో కూడిన టవర్లు నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3500 కోట్ల వ్యయంతో 5 టవర్ల పనులు చేపట్టారు. అమరావతి ప్రాంతంలోని నేల స్వభావాన్ని దృష్టిలో ఉంచుకుని రాఫ్ట్ ఫౌండేషన్ ద్వారా దుర్భేద్యంగా నిర్మించేందుకు ఈ పనులను గత టీడీపీ ప్రభుత్వం చేపట్టింది. అప్పుడే బేస్‌మెంట్ వరకు పనులు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ముందుగా ఈ టవర్ల నిర్మాణ పనులపైనే వేటు వేసింది. ఈ టవర్ల బేస్‌మెంట్ లోతున ఉండటం వల్ల వర్షాలకు నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. ఐదేళ్లుగా ఈ టవర్లు నీళ్లలో నానుతూనే ఉన్నాయి. దీంతో స్థానికంగా కొందరు ఈ నీళ్లలో చేపలు వేశారు. అవి పెరిగి పెద్దవి కావటంతో పట్టుకుంటున్నారు. బుధవారం ఆంధ్రజ్యోతి ఫొటో ప్రతినిధికి ఈ దృశ్యాలు కనిపించటంతో క్లిక్‌మనిపించారు. ఈ టవర్లు ఏమై పోయినా ఫర్వాలేదనుకుని నీళ్లు తీయకపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది. ఎలాగూ మనకైనా ఉపయోగపడుతుందన్న ఉద్దేశంతో కొందరు చేపపిల్లలు వేసి పెంచి పెరిగాక వాటిని వలలు వేసి పడుతున్నారు. స్థానికంగా కొంతమందికి ఇదే ఉపాధిగా మారిపోయింది. రాజుల సొమ్ము రాళ్లపాలు అంటే ఇదేనేమో! ఈ నిర్మాణాలు పూర్తయితే.. అత్యద్భుతమైన 40-45 అంతస్తులతో కూడిన సచివాలయ టవర్లు పూర్తయ్యేవి. వీటిలో ఒకటి ముఖ్యమంత్రి, సీఎంవో తదితరాలకు కాగా, వివిధ శాఖలకు సంబంధించిన మరో నాలుగు టవర్లు అత్యద్భుతంగా నిర్మాణం పూర్తయి ఉండేవి. వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో సచివాలయ టవర్స్ పరిస్థితి ఈ విధంగా తయారైంది. రాజధానిని పిచ్చిచెట్లవనంగా మార్చివేయటంతో పుట్టగొడుగులు

అంతరిక్ష విజ్ఞానాన్ని యువత అందిపుచ్చుకోవాలి

- షార్ డైరెక్టర్లు రాజరాజన్, రఘురామ్
- ఆర్‌వీఆర్ అండ్‌జేసీలో "జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు"

గుంటూరు(విద్య),జులై 24: చంద్రయాన్ -3 తరువాత ఆకాశమే హద్దుగా భారత అంతరిక్ష విభాగం విస్తరించిందని, దీనిని యువత సమర్థవంతంగా అందిపుచ్చుకుని ఇస్రోలో భాగస్వాములు కావాలని డైరెక్టర్లు, ఎ రాజరాజన్, టిఎస్ రఘురామ్ పిలుపునిచ్చారు. చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురష్కరించుకుని ఏర్పాటు చేసిన స్పేస్ ఎగ్జిబిషన్, సదస్సులో వారు మాట్లాడారు. ప్రపంచ దేశాల్లో భారత్‌ను శక్తివంత దేశంగా నిలపడమే లక్ష్యంగా షార్‌శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని, ఇందుకు యువత భాగస్వామం అందించాలన్నారు. చంద్రయాన్ -3



వేడుకల్ని ప్రారంభిస్తున్న డాక్టర్ శ్రీనివాస్, ఇస్రో శాస్త్రవేత్తలు

సంక్లిష్టమైన ఓ ప్రయోగాన్ని భారత్ సుసాధ్యం చేసి చూపించిందని, ఇది భవిష్యత్తులో చేసే ప్రయోగాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని ఉద్ఘాటించారు. గగన్ యాన్, చంద్రయాన్- 4 అంతరిక్ష ప్రయోగ విజయమే తమ ముందున్న లక్ష్యమని, అంతరిక్ష పరిశోధనా ప్రయోగాల్లో ప్రపంచ దేశాల్లో భారత్ 4వ స్థానంలో నిలవడం గర్వకారణమని చెప్పారు. రానున్న 2030 సంవత్సరానికి అంతరిక్ష కేంద్రంలో నిర్మాణ దిశగా ఇస్రో అడుగులు ముందుకు వేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు , డాక్టర్ జగదీష్ కె. మద్దినేని, కార్యదర్శి రాయపాటి గోపాల కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వి. శ్రీనివాస రావు, ఎన్ఎస్‌డి గుంటూరు సబ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టివి రమణారెడ్డి, ఎగ్జిబిషన్ కన్వీనర్ డాక్టర్ జి. రామ్మోహన్ రావు పాల్గొన్నారు. స్పేస్ ఎగ్జిబిషన్ తిలకించడానికి పలు పాఠశాలల విద్యార్థిని విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

మున్సిపల్ అధికారికి అరెస్టు వారెంట్ జారీ

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఓ ఆస్తి సర్వే చేసే విషయంలో నిర్లక్ష్యం వహించిన మున్సిపల్ అధికారిపై జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ బెయిలబుల్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఏటీ అగ్రహారం శాంతినగర్ ఐదో లైనుకు చెందిన జాజుల తిరుపతమ్మ సర్వే నెంబర్లు 39, 465లో ఉన్న తన ఆస్తిని సర్వే చేయాల్సిందిగా దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకోసం గత ఏడాది నగరపాలకసంస్థ నిర్ణయించిన ఫీజు రూ.2 వేలు చెల్లించారు. అయితే సర్వేయర్ ఏ కారణం చేతనో ఆ ఆస్తిని సర్వే చేయకుండా వాయిదా వేస్తూ వచ్చారు. దీనిపై ఆమె కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ పిటిషన్‌ని విచారించిన కమిషన్ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని జారీ చేసిన ఆదేశాలను మున్సిపల్ కార్పొరేషన్ పెడచెవిన పెట్టింది. ఈ నేపథ్యంలో బుధవారం అరెస్టు వారెంట్ జారీ చేసింది.

క్వారీలో కృష్ణా జిల్లా వాసి మృతి

పెదకాకాని, జూలై 24: పెదకాకాని పీహెచ్‌సీ సమీపంలోని ఓ క్వారీలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పెదకాకాని పోలీసులు బుధవారం తెలిపారు. కృష్ణాజిల్లా విసన్నపేట మండలం తాగుకుంట్ల గ్రామానికి చెందిన కడియాల వెంకట కృష్ణారావు(58)గా అతడ్ని పోలీసులు గుర్తించారు. ఆధార్ కార్డు ప్రకారం బంధువులకు సమాచారం ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ఏపీజీఎల్ఐ ఫైల్స్ క్లీయరెన్స్‌లో నిబంధనలు పాటించాలి

గుంటూరు(విద్య),జులై 24: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత బీమా గుంటూరు శాఖలో ఫైల్స్ క్లీయరెన్స్ విషయంలో నిబంధనలు పాటించాలని ఏపీటీఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ముందు సమర్పించిన తుది, రుణ చెల్లింపుల ఫైల్స్ చేయకుండా వెనుక సమర్పించిన వాటిని క్లియర్ చేసి బిల్స్‌కి పంపతున్నారని ఆరోపించారు. విజయవాడ రోడ్డులోని ఉన్న ఏపీజీఎల్ఐ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఎపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడుతూ గత రెండు నెలల క్రితం గడువు నిండిన ఉపాధ్యాయుల, ప్రధానోపాధ్యాయుల ప్రపోజల్స్ కార్యాలయంలో సమర్పిస్తే అవి చేయకుండా కేవలం 20 రోజుల క్రితం సమర్పించిన వారివి ప్రాసెస్ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా కార్యదర్శి ఎస్.ఎస్. మూర్తి,జిల్లా కౌన్సిలర్ పి.అంకారావులు పాల్గొన్నారు.

అరసవల్లికి అమరావతి రైతులు, మహిళలు



అరసవల్లి సూర్య భగవానుడి వద్దకు మొక్కు తీర్చుకోవడానికి బయలుదేరిన అమరావతి రైతులు

తుళ్లూరు, జూలై 24: మొక్కులు తీర్చుకోవడానికి శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్య భగవానుడు దగ్గరకి బుధవారం రాజధాని రైతులు, మహిళలు తుళ్లూరు నుంచి బయలుదేరారు. వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానులని అమరావతిని నిర్వీర్యం చేయటంపై ఉద్యమం చేపట్టిన రైతులు కూటమి గెలిచి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయడంతో మొక్కులు తీర్చుకునే పరంపర కొనసాగుతుంది. పంచముఖ ఆంజనేయ స్వామి భక్త కమిటీ ఆధ్వర్యంలో నాలుగు బస్సుల్లో 200 మంది రైతులు మహిళలు అరసవల్లికి బయలుదేరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలిస్తే ప్రతిపక్ష హోదా దక్కేదే

- బాబాయి హత్యపై స్పందించకుండా రౌడీషీటర్ హత్యపై యాగీ
- మాజీ సీఎం జగన్‌పై మండిపడిన ఎమ్మెల్యే యరపతినేని



మాట్లాడుతున్న గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తదితరులు

మాచవరం, జూలై 24: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ స్పీకర్, కోర్టుల్లో పిటిషన్లు వేస్తున్నారని, అయితే తొలుతే ఒళ్లు దగ్గర పెట్టుకుని పరిపాలన చేసి ఉంటే కనీసం ప్రతిపక్ష హోదా అయినా దక్కేదని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. బుధవారం మాచవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష హోదా గురించి కాకుండా తనపై ఉన్న కేసులను రోజువారీగా విచారణ చేపట్టి త్వరగా జైలుకు వెళ్లేందుకు కోర్టుకు వెళ్లాలని తెలిపారు. సొంత బాబాయి హత్యకు గురైతే ఐదేళ్లుగా స్పందించకుండా తాజాగా వినుకొండలో రౌడీషీటర్ హత్యకు గురైతే జగన్ నానా యాగీ చేస్తూ ఢిల్లీలో ధర్నాకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో పరిపాలన ప్రారంభమైన నెలరోజులకే రాష్ట్రపతి పరిపాలన పెట్టాలని జగన్మోహన్‌రెడ్డి చిందులు వేస్తున్నారన్నారు. గత ఐదేళ్లలో జరిగిన అన్యాయాలు, అక్రమాల గురించి మరేమి చేయాలో చెప్పాలని ప్రశ్నించారు. జగన్ అహంకారంతో విర్రవీగుతూ 100 మంది టీడీపీ నాయకులను చంపేశారని, సీనియర్ నాయకులను అరెస్టు చేసి జైల్లో పెట్టారని ఆరోపించారు. 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయినా ఇంకా బుద్ధి రాలేదన్నారు. పోలీసులను అడ్డంపెట్టుకుని పరదాల చాటున తిరిగిన జగన్మోహన్‌రెడ్డి నేడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. నరకాసుర వధ జరిగితే ఎంత సంతోషంగా ఉంటుందో వైసీపీ ఓడిపోవడంతో ప్రజలు అంత సంతోషంగా ఉన్నారన్నారు. లక్షల కోట్లు దోపిడీ చేసి రాష్ట్రాన్ని ఆర్థికంగా అణగదొక్కారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 వేల కోట్లు, పోలవరం పూర్తితో పాటు వివిధ రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు ఇవ్వడం చంద్రబాబునాయుడు సీనియారిటీకి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో 2014 నుంచి 2019 వరకు జరిగిన అభివృద్ధి తప్ప గత ఐదేళ్లలో ఏమీ జరగలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రానికి పరిశ్రమలు రావడం ప్రారంభమయ్యా యన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రగతి పట్టాలపై ఎక్కించేందుకు చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. గురజాల నియోజకవర్గంలో సుమారు 3వేల ఎకరాలు అన్యాక్రాంతం చేసినబ్యాంకుల్లో రుణాలు తీసుకున్న వైసీపీ నాయకులపై విచారణ చేపట్టి బాధ్యులను చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, యామని రామారావు, కొల్లి కృష్ణమూర్తి, యడ్లపల్లి రామారావు, మాలపాటి మల్లయ్య, వడ్డవల్లి సర్వేశ్వరరావు, యామని రాంబాబు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, చిట్టిప్రోలు నరసింహారావు, తదితరులు ఉన్నారు.

జగన్ చేయలేని దాన్ని చంద్రబాబు చేసి చూపించారు



జడ్పీ చైర్‌పర్సన్ క్రిస్టీనా

గుంటూరు సిటీ, జూలై 24: జగన్ ఐదేళ్ళ పదవీ కాలంలో చేయలేని పనిని చంద్రబాబు కేవలం 45 రోజుల పాలనలో చేసి చూపించారని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ ప్రసంగంలో ఆంధ్రా పేరు మారుమోగిందన్నారు. గత ఐదేళ్లలో ఏనాడూ ఆంధ్రా ఊసు ఎత్తిన దాఖలాలు లేవన్నారు. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకుంటే ప్రజలకు ఎంత మేలు జరుగుతుందో కేంద్ర బడ్జెట్ ను పరిశీలిస్తే అర్థం అవుతుం దన్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ, ప్రధాని మోదీ వద్ద వారికి ఉన్న పరపతి వల్లే అమరావతికి రూ.15 వేల కోట్లు వచ్చాయన్నారు. వెనుక బడిన విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ప్రకాశం, కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలకు నిధులతో పాటు విశాఖపట్నం నుంచి చెన్నై వరకు కారిడార్ నిర్మాణం కోసం నిధులు సాధించటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తాను సీఎంగా ఉన్నప్పుడు పలుమార్లు ఢిల్లీ వెళ్లిన జగన్ తన కేసుల విషయం మాట్లాడుకున్నారు తప్ప రాష్ట్రానికి నిధుల విషయాన్ని పూర్తిగా విస్మరించారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ తెలిపారు.

28న కృత్రిమ అవయవాల అమరికకు కొలతలు

గుంటూరు(తూర్పు), జూలై 24: దురదృష్టవశాత్తు అవయవాలు కోల్పోయిన వారికి కృత్రిమ అవయవాల కొరకు కొలతల కార్యక్రమం 28న గుంటూరు బృందావన్ గార్డెన్స్, కుందుల రోడ్డు, కమ్మజన సేవ సమితి ఆవరణలో నిర్వహిస్తామని కమ్మజన సేవా సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ తెలిపారు. కొలతలు తీసుకున్న వారికి త్వరలోనే రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటినీయల్, చేతన ఫౌండేషన్ (అమెరికా) సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా అవయవాలు అందజేస్తామన్నారు. కార్యక్రమానికి వచ్చే వారికి, వారి సహాయకులకు ఉచిత భోజనం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కులమతాలకు అతీతంగా కార్యక్రమం జరుగుతుందన్నారు. వివరాలకు 95733 82906 అనే నెంబరును సంప్రదించాలని సూచించారు.

ప్రజా సేవే టీడీపీ అజెండా: ఎమ్మెల్యే అరవిందబాబు



నరసరావుపేట టౌన్, జూలై 24: ప్రజలకు మేలు చేయడమే టీడీపీ ప్రభుత్వ ఏకైక అజెండా అని మరోసారి నిరూపితమైందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. అసెంబ్లీలో బుధవారం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ పేరు పునరుద్ధరణ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లులకు చదలవాడ మద్దతు తెలిపి ప్రసంగించారు. ప్రపంచస్థాయిలో రాష్ట్ర ప్రతిష్ఠను ఇనుమడింపజేసిన ఎన్టీఆర్ రాష్ట్రంలో తొలి మెడికల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి వైద్య విద్యకు తోడ్పాటుగా నిలిచారన్నారు. అలాంటి పేరును జగన్‌రెడ్డి తొలగించడం అత్యంత దుర్మార్గమన్నారు. వర్సిటీకి చెందిన రూ.300 కోట్లు దారి మళ్లించడం అత్యంత దుర్మార్గమని, ఆ సొమ్మును రికవరీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల ఆస్తుల్ని కబ్జా చేసే విధంగా, అత్యంత దుర్మార్గంగా చట్టం తీసుకువచ్చారని ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై జరిగిన చర్చలో జగన్‌పై ధ్వజమెత్తారు. ఐదేళ్ల పాటు చేయాల్సిన దారుణాలన్నీ చేసి ఇప్పుడు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఢిల్లీలో డ్రామా లాడుతున్నారన్నారు. ఐదేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని మంటగలిపి ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారని, ఇలాంటి అరాచక శక్తిని మరోసారి నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి జైలు.. జరిమానా

పిడుగురాళ్ల, జూలై 24: చెల్లని చెక్కు కేసుల్లో బత్తుల రంగారావు, గోగుల వెంకటేశ్వరరావులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి మురళీగంగాధరరావు తీర్పు ఇచ్చారు. పిడుగురాళ్లకి చెం దిన కాటా వెంకటేశ్వర్లు వద్ద గుంటూరుకి చెందిన బత్తుల రంగారావు రూ.5 లక్షలు అప్పుగా తీసుకుని చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కు చెల్లకపోవడంతో ఫిర్యాది కాటా వెంకటేశ్వర్లు కోర్టులో కేసు వేసినట్లు న్యాయవాది ఉడతా కోటేశ్వరరావు తెలిపారు. ఈ కేసులో చెల్లని చెక్కు ఇచ్చిన బత్తుల రంగారావుకు సంవత్సరం జైలుశిక్ష, రూ.5 లక్షల నష్టపరిహారం చెల్లించాలని న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. పిడుగురాళ్లకు చెందిన కాళంగి ఏడుకొండలు వద్ద నల్గొండ జిల్లా హుజుర్‌నగర్‌కి చెందిన గోగుల వెంకటేశ్వరరావు రూ.10 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వెంకటేశ్వరరావు ఇచ్చిన చెక్కు బౌన్స్ కావడంతో కాళంగి ఏడుకొండలు కోర్టులో కేసు వేయగా నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష, రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని న్యాయాధికారి తీర్పు ఇచ్చారు.

45,150 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 48,776 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 45,150 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 18,160 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	10000	14000
నెంబరు. 5	9000	14800	నెంబరు. 5	12500	13500
273	10500	12500	273	12000	12000
341	9500	16000	341	9000	15000
4884	14000	15000	4884	–	–
సూపర్ 10	13100	13100	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	18500	తేజ	8500	18500
బ్యాడిగి	8500	16000	బ్యాడిగి	9000	14000
దేవనూరుడీలక్స్	8500	15000	దేవనూరుడీలక్స్	11500	12500
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5000	10500

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఆర్ అండ్ బీ రోడ్లకు నిధులివ్వండి

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మంత్రి బీసీ జనార్దనరెడ్డితో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, జూలై 24 : నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆర్ అండ్ బీ మంత్రి బీసీ జనార్ధనరెడ్డిని కోరారు. మంగళవారం రాత్రి మంత్రికి ఈమేరకు బ్రహ్మారెడ్డి వినతిని అందజేశారు. అందులో ప్రధానంగా పాలువాయి జంక్షన్ నుంచి సత్రశాల పుణ్యక్షేత్రం వరకు 11.294 కి.మీకు రూ.21 కోట్ల 60 లక్షలు,దుర్గి నుంచి వెల్దుర్తి వరకు 17.600 కి.మీకు రూ.31 కోట్ల 60 లక్షలు,మాచర్ల నుంచి విజయపురిసౌత్ వరకు 22 కి.మీ వరకు రూ.31 కోట్లు, లోయపల్లి నుంచి లచ్చమ్మబావి తండా వరకు 25.500 కి.మీకు గాను రూ.33.50 కోట్లతో ఆర్ అండ్ బీ ఏఈఈ తయారు చేసిన ప్రతిపాదనలు బ్రహ్మారెడ్డి మంత్రికి అందచేశారు. మంత్రి మాట్లాడుతూ ఇంజనీర్ ఇన్ చీఫ్ వేణుగోపాలరెడ్డికి దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత తొందరగా క్లియర్ చేయిస్తానని హామీనిచ్చారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



అచ్చంపేటలో సీఎం చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ మహిళలు

అచ్చంపేట, జూలై 24 : కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ముఖ్యపాత్ర పోషించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు అచ్చంపేటలోని టీడీపీ పట్టణ మహిళలు బుధవారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మామిళ్ళపల్లి విజయలక్ష్మి, వెనిగడ్ల సుభద్ర, జె.లక్ష్మీ ప్రసన్న, కృష్ణప్రియ, ఈశ్వరమ్మ, కే లక్ష్మి, ఉదయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమరావతికి నిధుల కేటాయింపుపై హర్షం

పిడుగురాళ్ల, జూలై 24: మొదటి బడ్జెట్ సమావేశాలలోనే అమరావతి రాజధానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ప్రకటించడం సంతోషదాయకమని తెలుగుమహిళ నరసరావుపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాజేశ్వరి తెలిపారు. బుధవారం కరాలపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వేమవరపు జాన్‌బీ, పగడాల రమణ, దాచేపల్లి జాన్‌బి, గాలి చిన్నమ్మాయి, గద్దె వెంకటరత్నం, పద్మ, షేక్ ఫాతిమా, వెంకమ్మ, పలువురు తెలుగుమహిళలు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



ఖాతాదారులకు బోనస్‌లు అందజేస్తున్న సంగం డెయిరీ అధికారులు

క్రోసూరు, జూలై 24 : మండలంలోని పీసపాడు, అందుకూరు గ్రామాల్లో సంగం డెయిరీ ద్వారా 179 మంది పాల ఉత్పత్తి దారులకు బుధవారం రూ.4.27 లక్షలు బోనస్ సను అందజేశారు. సంగం డెయిరీ డైరెక్టర్ వలివేటి ధర్మారావు ఈ సందర్భంగా మాట్లాడుతూ డెయిరీ లాభాల్లో కొంత మొత్తాన్ని పాల ఉత్పత్తి దారులకు పంచటం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రతి వంద రూపాయలకు నాలుగు రూపాయల చొప్పున బోనస్‌ను ఉత్పత్తి దారులకు అందిస్తున్నట్లు తెలిపారు. అందుకూరులో 115 మంది ఉత్పత్తి దారులకు రూ.1.76 లక్షలు, పీసపాడు లో 64 మంది పాల ఉత్పత్తి దారులకు రూ 2.52 లక్షలు బోనస్‌గా అందజేశారు. కార్యక్రమంలో రెంటపాళ్ళ పాల శీతలీకరణ కేంద్రం ఇన్‌చార్జ్ గోపీ, సూపర్‌వైజర్ నరేంద్ర, అందుకూరు కేంద్రం అధ్యక్షుడు రామారావు పాల్గొన్నారు.

సత్సంబంధాలు నెలకొల్పేందుకే పల్లెనిద్ర : ఎస్‌ఐ

కారంపూడి, జూలై 24: పోలీసులు, ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పేందుకు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ అమీర్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని చినగార్లపాడులో ఆయన పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమయ్యారు. గొడవల వల్ల జరిగే నష్టాలు, సైబర్ క్రైం, చీటింగ్, దొంగతనాలు తదితర నేరాలపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా శాంతియుత వాతావరణంలో జీవించాలన్నారు. గ్రామంలో ఎవరైనా అలజడులు సృష్టిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామస్థులు కక్షలు, కార్పణ్యాలకు దూరంగా ఉంటూ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు

● ఎంవీఐ శేషిరెడ్డి

మాచర్లటౌన్, జూలై 24: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ శేషిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద గురువారం ఆయన ఆర్టీసీ డీఎం రెంటాల పిచ్చయ్యతో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న రెండు వాహనాలను సీజ్ చేసి రూ.90 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా శేషిరెడ్డి మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన పేపర్లను వెంట ఉంచుకోవాలన్నారు. ఇన్సూరెన్స్, వాహనం ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలన్నారు.

బలహీనవర్గాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు

● జాషువా వర్ధంతిలో మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి



నారాయణపురంలో గుర్రం జాషువా విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి, జూలై 24: బలహీనవర్గాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతానని మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. బుధవారం నారాయణపురంలోని గుర్రం జాషువా 54వ వర్ధంతి సందర్భంగా జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలనాడు బలహీనవర్గాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన జాషువా వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కష్టపడి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. నేటి సమాజంలో బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఐక్యంగా ఉండాలని, అప్పుడే ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో పురోగతిని సాధించవచ్చునని వివరించారు. బలహీనవర్గాలకు రిజర్వేషన్ కేటాయించిన చోట ప్రజాప్రతినిధులు ఒక్కరే ఐదేళ్లు కొనసాగే విధంగా చర్యలు తీసుకునేందుకు గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దృష్టికి తీసుకెళ్లి బలహీనవర్గాలకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతానని వివరించారు. అనంతరం గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మునగా నిమ్మయ్య, బత్తుల వెంకయ్య, యరగాని హనుమంతరావు, గద్దల వేదమణి, కౌన్సిలర్ షరీఫ్, భూషణం చెన్నయ్య, ముశ్యం వెంకటేశ్వర్లు మేస్త్రి, పిల్లి చెన్నారావు, నల్లబోతుల రాజు, కొక్కెర కొండలు తదితరులున్నారు.

తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన జాషువాకి నివాళి



గుర్రం జాషువా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎలినేడి రామస్వామి, కన్నా నాగరాజు తదితరులు

సత్తెనపల్లి, జూలై 24: తెలుగు సాహిత్యానికి వన్నె తెచ్చిన మహాకవి గుర్రం జాషువా అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎలినేడి రామస్వామి, గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజులు అన్నారు. టీడీపీ, కవి కోవికోకిల గుర్రం జాషువా సాహితీ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం గుర్రం జాషువా వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న గుర్రం జాషువా విగ్ర హానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో చౌట శ్రీనివాసరావు, కోమటినేని శ్రీనివాసరావు, అంకాల ప్రభుదాసు, బండారు నాగరాజు, ఇర్మియ, బలిజేపల్లి సురేష్, మస్తాన్‌వలి, నూర్ బాషా జానీ బాబు తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ అధ్య క్షుడు దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చాంద్ బాషా, సాంబశివ రావు, శంకరరావు, శంకర్, పాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, కందిపప్పు కేంద్రం ప్రారంభం

పట్టణంలోని మాచర్ల రోడ్డులో పౌర సరఫరాల శాఖ ఆదేశాల మేరకు ధరల నియంత్రణలో భాగంగా బుధవారం చౌక ధరలకే బియ్యం అమ్మకం కేంద్రాన్ని కన్నా నాగరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, చౌట శ్రీనివాసరావు, పీ అంబిక, పీ మోహన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కవిత్వాన్ని ఆయుధంగా చేసిన జాషువా

రెంటచింతల, జూలై 24 : కవిత్వాన్ని ఆయుదంగా చేసుకుని మూఢాచారాలపై తిరగబడి సమాజ హితాన్ని ఆకాంక్షించిన గుర్రం జాషువా రచనలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ మోహన్ అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన రచనల ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కన్నెగంటి హనుమంతు ఫెడరేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో అవకతవకలు

● వైసీపీ హయాంలో భారీగా డబ్బులు వసూలు
● నిర్వాహకులను నిలదీసిన టీడీపీ నేతలు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రం

గురజాలటౌన్, జూలై 24: ఆధార్ కేంద్రం నిర్వహిస్తున్న నిర్వాహకులు అక్రమ సంపాదనకు తెగబడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి సంపాదన రుచి మరిగిన వీరు నూతన ప్రభుత్వంలో కూడా అదేతీరును కొనసాగించేందుకు ప్రయత్నాలు చేశారు. తీరా ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు ఆధార్ కేంద్రానికి చేరుకొని నిర్వాహకులను నిలదీశారు. ఈ సంఘటన గురజాల పట్టణంలో బుధవారం జరిగింది. గురజాల పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఇద్దరు వ్యక్తులు ఆధార్‌కేంద్రం నిర్వహిస్తున్నారు. ఆధార్‌కార్డులో మార్పు చేర్పులకు ఇష్టానుసారంగా రేట్లు ఫిక్స్ చేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. గత వైసీపీ హయాంలో ఆధార్‌కార్డులో వయసు మార్పులు చేసి అక్రమంగా వేలాది రూపాయలు కాజేసి జేబులు నింపుకున్నారు. గతంలో కొందరు దీనిపై పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారం అండతో వైసీపీ నేతలు కలగజేసుకోవడంతో చర్యలు తీసుకోలేదు. కాగా ప్రభుత్వం మారినప్పటికీ ఈ ఆధార్‌కేంద్రం నిర్వాహకుల తీరు మారలేదు. పాత పద్ధతిలోనే అక్రమ వసూళ్లకు తెగబడుతున్నారు. ఆధార్‌కార్డులో మార్పు చేర్పులకు వచ్చిన వారికి నిర్దేశిత ధర కంటే అధికంగా వసూలు చేస్తున్నారు. బుధవారం ఓ వ్యక్తి ఆధార్ కార్డులో పుట్టినతేదీ మార్చాలని ఆధార్ కేంద్రం నిర్వాహకులను కోరారు. దీనికి నిర్వాహకులు రూ.5 వేలు ఖర్చవుతుందని చెప్పారు. ఇదేమని ప్రశ్నిస్తే టీడీపీ నాయకులు పేర్లు చెప్పి వారు వసూలు చేయమన్నారంటూ చెప్పుకొచ్చారు. సదరు వ్యక్తి ఈ విషయాన్ని టీడీపీ నేతల దృష్టికి తీసుకెళ్లడంతో వారు ఆధార్ కేంద్రంకు వెళ్లి నిర్వాహకులను నిలదీశారు. దీంతో నిర్వాహకులు అలా చెప్పలేదంటే నీళ్లు నమిలారు. గట్టిగా ప్రశ్నించడంతో నిర్వాహకుల అక్రమాలు బట్టబయలైంది. వెంటనే టీడీపీ నేతలు దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కాగా నిర్వాహకుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నట్లు సమాచారం.

గొడవలు వద్దు.. ప్రశాంతత ముద్దు : సీఐ



గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

దుర్గి, జూలై 24: ప్రశాంతమైన గ్రామాల్లో రాజకీయ ఉచ్చులో చిక్కుకొని ఇబ్బందుల పాలవొద్దని కారంపూడి సర్కిల్ సీఐ అలహరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని ఆత్మకూరు, దుర్గి గ్రామాల్లో ఆయన కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పిస్తూ చట్ట వ్యతిరేక పనులు చేసి ఇబ్బందులు పడొద్దని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్‌ఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

75 తాళ్ళూరులో పోలీసు పికెట్

పెదకూరపాడు, జూలై 24: పెదకూరపాడు మాజీ ఎంపీపీ, క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ మాజీ చైర్మన్, 75 తాళ్ళూరుకు చెందిన ఈదా సాంబిరెడ్డిపై మంగళవారం దాడి చేసిన వారిని శిక్షించాలంటూ వైసీపీ జిల్లా సీనియర్ నాయకులు, తాళ్ళూరు మాజీ సర్పంచ్ గొట్టికొండ అంజిరెడ్డి, పలువురు గ్రామస్థులు వినతిపత్రాన్ని స్పెషల్ బ్రాంచ్ సీఐ శోభన్ బాబుకు బుధవారం అందించారు. మంగళవారం గుంటూరు నుంచి కారులో వస్తున్న సాంబిరెడ్డిపై గుర్తుతెలియని వ్యక్తులు రాడ్లు, కర్రలతో సాంబిరెడ్డిపై దాడికి దిగారు. ఈ దాడి నేపథ్యంలో బుధవారం వైసీపీ నేతలు ధర్నాకు పిలుపు నివ్వటంతో ముందస్తుగా వంద మంది పోలీసులతో గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుపికెట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలో ఏఎస్పీ రాఘవేంద్రరావు బందోబస్తును పర్యవేక్షించారు.

దాడి కేసులో 307 సెక్షన్ నమోదు

అమరావతి, జూలై 24: వైసీపీ నాయకుడు ఈదా సాంబిరెడ్డిపై దాడికి సంబంధించి పోలీసులు 307 సెక్షన్ నమోదు చేశారు. పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు అమరావతి పోలీసుస్టేషన్‌లో ఉండి కేసు విచారణ చేపట్టారు. నిందితుల ఆచూకీ కోసం ఐదు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. దాడిలో పాల్గొన్న కేసులో నలుగురు అను మానితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

బెల్లంకొండ, జూలై 24: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని చండ్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యులు కేవీ కోటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం బెల్లంకొండ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమల వ్యాప్తిని నిరోధించటానికి కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫణికుమార్, సీహెచ్‌ఎన్ వాణి, సూపర్‌వైజర్ బేగం, బాషా తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై గ్రామసభలు

కారంపూడి, జూలై 24: మండల పరిధిలోని లక్ష్మీపురం, బట్టువారిపల్లె, ఇనుపరాజుపల్లె గ్రామాల్లో బుధవారం స్వచ్ఛభారత్, జలజీవన్ మిషన్ సీజనల్ వ్యాధులపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభల్లో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ మాట్లాడుతూ గ్రామంలో నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించుకోవాలని సూచించారు. జలజీవన్ మిషన్ కింద లక్ష్మీపురం, బట్టువారిపల్లె, ఇనుపరాజుపల్లి గ్రామాల్లో పనులు చేసి ఇంటింటికి కులాయి ద్వారా నీటిని పంపిణీ చేయనున్నామన్నారు.

వీధి కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్

మాచర్లటౌన్, జూలై 24: పట్టణంలోని జెండా సెంటర్, పశువుల హాస్పిటల్ బజారు తదితర ప్రాంతాల్లో బుధవారం వీధి, పెంపుడు కుక్కలకు అధికారులు రేబీస్ వ్యాక్సిన్ ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా వ్యాక్సిన్ అందించాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.

తెల్లజాతి పశువులకు వ్యాక్సిన్

క్రోసూరు, జూలై 24 : తెల్లజాతి పశువులకు లంపి స్కిన్ సోకకుండా వ్యాక్సిన్ ఇస్తున్నట్టు మండల పశు వైద్యాధికారి డాక్టర్ మల్లయ్య తెలియజేశారు. తెల్లజాతి పశువుల పెంపకం దారులందరూ ఈ అవ కాశాన్ని ఉపయోగించు కోవాలని బుధవారం దొడ్లేరులో జరిగిన వ్యాక్సిన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఆయన చెప్పారు.

పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలి : ఉప ఎంపీపీ

బెల్లంకొండ, జూలై 24: వర్షాకాల సీజన్ కావటంతో గ్రామాల్లో పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని మండల వైస్ ఎంపీపీ మరియమ్మ పేర్కొన్నారు. బుధవారం బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ మరియమ్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, హెల్త్ సిబ్బంది 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో వెంకటరెడ్డి, జడ్పీటీసీ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి మరుగు దొడ్లు

అచ్చంపేట, జూలై 24: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం (ఓడీఎఫ్ ఫేజ్ - 2) చేపట్టనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తెలిపారు. బుధవారం మండలంలోని కోనూరు గ్రామ సచివాలయంలో గ్రామ సర్పంచ్ ఏకుల రాములమ్మ అధ్యక్షతన గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా ఆశీర్వాదం మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటికి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ళూరి లక్ష్మీనారాయణ, మచ్చా సుధాకర్, గ్రామ కార్యదర్శి శివయ్య, వీఆర్‌వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు మెడికల్ కిట్లు పంపిణీ

క్రోసూరు, జూలై 24: మండలంలోని అనంతవరంలో ఫ్లోరోసిస్ వ్యాధితో బాధపడుతున్న వారికి వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మంజూరు చేయబడిన ఫ్లోరోసిస్ మెడికల్ ఎయిడ్ కిట్లను ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్ బుధవారం పంపిణీ చేశారు. ఫ్లోరోసిస్ వ్యాధిలో భాగంగా మెడ, నడుము నొప్పి ఉన్న వారికి, నడవ లేని వారికి, వాకింగ్ స్టిక్స్, లుంబర్ బెల్టులు, నెక్ బెల్టులు ఈ సందర్భంగా అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు డీవీ పద్మ, ప్రాంక్లిన్, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కపాడులో వాకింగ్ స్టిక్స్ అందజేత

రాజుపాలెం, జూలై 24: మండలంలోని మొక్కపాడు గ్రామంలో మెడ, నడుము నొప్పిగా, నడవలేని వారికి మొత్తం 29 మందికి నడుము, మెడ నొప్పి ఉన్నావారికి బెల్ట్‌లను సర్పంచ్ పద్మ బుధవారం అందజేశారు. స్థానిక వైద్యులు కృష్ణకుమార్ ఆధ్వర్యంలో నడుము నొప్పిగా ఉన్నావారికి బెల్టులు 17, మెడ బెల్టులు 1, వాకింగ్ స్టిక్స్ 11 మందికి అందజేశారు.

హసానాబాద్‌లో నేత్ర వైద్యశిబిరం

క్రోసూరు, జూలై 24: మండలంలోని హసానాబాద్‌లో బుధవారం మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించగా 380 మంది శిబిరానికి హాజరయ్యారు. వారిలో 63 మందిని ఆపరేషన్‌ల కోసం ఎంపిక చేసినట్టు నిర్వాహకులు తెలియజేశారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు, మరి కొంత మందికి మందులు పంపిణీ చేసినట్టు తెలియజేశారు. నేత్ర వైద్య నిపుణులు బాలకృష్ణ, మల్లేష్ వైద్యసేవలు అందజేశారు.

బావులను పూడ్చి ఆక్రమించుకుంటున్నారు

దాచేపల్లి, జూలై 24: దాచేపల్లి నగర పంచాయతీ నారాయణపురంలో కొంతమంది వ్యక్తులు మంచినీటి బావులను పూడ్చి గోడలు నిర్మించి స్థలాలను ఆక్రమించుకుంటున్నారని పోతుల వెంకటేశ్వర్లు గురజాల ఆర్‌డీవో రమణాకాంత్ రెడ్డి, దాచేపల్లి నగర పంచాయతీ కమిషనర్ నారాయణరావులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. నారాయణపురంలో ప్రైవేటు పాఠశాల ప్రహరీని ఆనుకొని ఉన్న బావిని పూడ్చివేసి గోడ నిర్మించారని వివరించారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా అభివృద్ధి చెందాలి

● ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచవరం, జూలై 24: రాష్ట్ర వ్యాప్తంగా ఆర్యవైశ్యులు రాజకీయంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని వారికి టీడీపీలో ప్రాధాన్యం ఇస్తారని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో టీడీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ మిర్చి వ్యాపారవేత్త చిట్టిప్రోలు నరసింహారావు ఇంట్లో ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీలో ఆర్యవైశ్య సంఘ నాయకులకు మంత్రి పదవులో కూడా చోటు కల్పించారన్నారు. పార్టీ అన్ని వేళలా ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు బడిగుంచల వెంకటేశ్వర్లు, యడ్లపల్లి రామారావు, కొల్లి కృష్ణమూర్తి, యామని రామారావు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, మాలపాటి మల్లయ్య, శివపార్వతి సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణంపై విచారణ హర్షణీయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జూలై 24: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సీఎం చంద్రబాబు నాయుడు సీఐడీ విచారణకు ఆదేశించించటం హర్షణీయమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం వల్ల అనారోగ్యం పాలవటంతో పాటు అనేకమంది ప్రాణాలు కోల్పోయారని కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. సీఐడీ విచారణలో వైసీపీ హయలో మద్యం అక్రమాలకు పాల్పడిన వారి బండారం బయట పడుతుందని, మద్యం బ్రాండ్లలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదని అన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ కంపెనీలకైతే అక్రమంగా దోచిపెట్టిందో, ఆ దోపిడీ సొమ్మును ఆ కంపెనీ నుంచి రికవరీ చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పేదవాళ్ళు తాగే 180ఎంఎల్ లిక్కర్ రూ.50లు, లేక రూ.70లు మాత్రమే ఉండేదని, కానీ వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా ధరలు పెంచటంతో పాటు, టీడీపీ ప్రభుత్వంలో ఉన్న 31మద్యం బ్రాండ్లు రాష్ట్రంలో లేకుండా చేసి, కేవలం రెండు బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉండేలా చేసిన జగన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు.

సాగర్ కాలువలపై రైతులు ఇంజన్‌లు పెట్టరాదు

నకరికల్లు, జూలై 24: నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని కాలువలపై రైతులు నీటి ఇంజన్‌లు పెట్టరాదని తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ ఆదేశాలు ఇచ్చారు. సాగర్ కాలువ నుంచి గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు మంచి నీరు చెరువులను నింపటానికి నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఆయా కాలువల పరిధిలోని వీఆర్‌వోలు తమపరిధిలోని కాలువలపై రైతులు వ్యవసాయ మోటారు ఇంజన్‌లు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు.

వజ్రాల వేట కోసం కొండకు వస్తే కఠిన చర్యలు

● తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ



త్రిపురాపురం కొండ వద్ద ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

నకరికల్లు, జూలై 24: త్రిపురాపురం కొండ వద్దకు వజ్రాల కోసమని, విలువైన ఖనిజాల వెతుకులాట కోసం ప్రయత్నిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసు కుంటామని తహసీల్దార్ హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, ఎస్‌ఐ కే నాగేంద్రరావులు తమ సిబ్బందితో త్రిపురాపురం కొండ వద్దకు చేరుకొని అక్కడ వజ్రాల కోసం, విలువైన ఖనిజాల కోసం వెతుకులాడుతున్న వారిని హెచ్చరించారు. రంగురాళ్ల కోసం త్రిపురాపురం కొండకు ఎవ్వరూ రాకూడదని బోర్డును ఏర్పాటు చేశారు. ప్రజలందరూ ఇది గమనించి జాగ్రత్త వహించాలని పోలీసు, రెవెన్యూ అధికారులు సూచనలు చేశారు.

తాగునీరు, వీధిదీపాలపై దృష్టి పెట్టాలి : కమిషనర్



అధికారులకు సూచనలు చేస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు

మాచర్లటౌన్, జూలై 24: పట్టణంలో తాగునీరు, వీధిదీపాలపై దృష్టి పెట్టాలని మున్సిపల్ కమిషనర్ వెం కటదాసు సూచిం చారు. పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణానికి కుడికాలువ నుంచి తాగునీటిని అందిం చే పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వీధి దీపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టు 15న అన్న క్యాంటీన్ ప్రారంభించనున్న నేపథ్యంలో క్యాంటీన్ పనులపై చర్చించారు. ఈ సమావేశంలో డీఈ మధుసూదన రావు, ఏఈ చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురం రీచ్‌లో బ్రోకర్లదే హవా



వైకుంఠపురం రీచ్‌లో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

అమరావతి, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల సంక్షేమం కోసం అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానం అమరావతి మండలం వైకుంఠపురంలో అభాసుపాలౌతుంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలు ఇసుక జోలికి వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేసినప్పటికి కూటమికి చెందిన నాయకులు తమ బంధువులను, అనుచరులను రీచ్‌ల వద్ద ఉంచి ఇసుక లోడింగ్‌కు వాహనాలు రాకముందే వేరువేరు ఆధార్ పత్రాలతో ఇసుక బుకింగ్ చేస్తున్నారు. సంబంధిత బిల్లులు లారీ డ్రైవర్‌లకు ఇచ్చి అదనంగా రూ.1000 సొమ్ము చేసుకొంటున్నారు. ఈ విధంగా వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించి ఇసుక కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకెళ్లిన ఇసుకను రూ16 వేల వరకు అమ్ముతున్నారు. 20 టన్నుల ఇసుక గుంటూరుకు 12వేలకు చేర్చాల్సి ఉండగా వినియోగదారుల నుండి వాహన యజమానులు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. పై దందాతోపాటు ఇసుక రీచ్‌లో వైకుంఠపురం గ్రామానికి చెందిన కొందరు వాహనాలకు క్యూపద్ధతి లేకుండా లోడింగ్ చేయాలని బెదిరించడంతో పాటు కొంతమంది బ్రోకర్లు సీరియల్ పాటించకుండా లోడింగ్ చేయించుకుంటున్నారు. రీచ్‌లలో తిష్ఠ వేసిన బ్రోకర్లను అక్కడ నుంచి పంపించి ఇసుక లోడింగ్ సక్రమంగా జరిపి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కే అరుణదేవి

నకరికల్లు, జూలై 24 : ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా సత్తెనపల్లిలో సీఎస్‌డీటీగా పని చేస్తున్న కే అరుణదేవిని నియమించారు. ఈ మేరకు కలెక్టర్ పీ అరుణ్‌బాబు నియామక ఉత్తర్వులను జారీ చేశారు.

అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం

బెల్లంకొండ, జూలై 24 : దేవదాయశాఖ అధికారులు ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని మన్నెసుల్తాన్‌పాలెం గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం చేపట్టడం మంచి పద్ధతి కాదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగం గానే గ్రామానికి చెందిన కొంత మంది నాయకులు కొద్ది రోజుల క్రితం దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. బుధవారం మన్నె సుల్తాన్‌పాలెం గ్రామానికి అసిస్టెంట్ కమిషనర్ సత్యనారా యణరెడ్డి, డీఈ జనార్దన్, ఏఈ మాధవరెడ్డి నిర్మాణం జరిపిన ప్రదే శం వద్దకు వచ్చి గ్రామస్థులతో చర్చించారు. కార్యక్రమంలో డీఈతో పాటు ఈవో వెంకటేశ్వరరెడ్డి, ఏఈ మాధవరెడ్డి, ఇన్‌స్పెక్టర్ లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పవన్ కల్యాణ్‌ను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

● అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు కోసం వినతి


ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 24: పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం మంగళగిరి జనసేన కార్యాలయంలో కలిశారు. నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా కోటప్పకొండ ఘాట్‌రోడ్డు, కోటప్పకొండ చుట్టూ రోడ్లు అనుసంధానం చేసేందుకు దాదాపు రూ.30కోట్లు పైగా అవసరం అవుతుందని చెప్పారు. నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో తాగునీరు. పారిశుధ్యం, సాగునీటి కాలవల్లో పూడిక తొలగింపు లాంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, గ్రామీణ ప్రాంతాలంటే రాష్ట్రాభివృద్ధికి అత్యంత కీలమని చెప్పారు. అదే సమయంలో కోటప్పకొండ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట శాఖమూరి రామూర్తి తదితరులు ఉన్నారు.


కాలవ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, అధికారులు

పూడికతీత పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

వినుకొండ టౌన్, జూలై 24: స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు పెరుమాలపల్లి మేజర్ కావలలో పూడిక తొలగింపు పనులను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా కాలవలో చెత్తతో పూడిపోయిందని, దీంతో కాలువలో ప్రవహించే నీరు కలుషితం అవుతుందని, కాలువ నీరు స్థానికులు నిత్యం గృహ అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉండడంతో విష్ణుకుండీనగర్ నుంచి రైల్వే ట్రాక్ వరకు పూడిక తొలగించి కాలవను శుభ్రంచేయడం జరుగుతుందని తెలిపారు. గతంలో పట్టణ నడిబొడ్డున కాలవ పరిస్థితి ప్రజలు చూశారని, ఇప్పుడు ఎలా ఉందో ప్రజలు గమనించి హర్షం వ్యక్తం చేస్తున్నట్లు దస్తగిరి తెలిపారు. ఆయనతోపాటు డీఈ వెంకయ్య, ఏఈ శ్యామ్యూల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, సిబ్బంది పాల్గొన్నారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రోప్ స్కిప్పింగ్ పోటీల్లో సంసిద్ విద్యార్థుల ప్రతిభ

కనమర్లపూడి (శావల్యాపురం) జూలై 24: గుంటూరు పట్టణంలోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 20వ తేదీ నుంచి జరిగిన రోప్ స్కిప్పింగ్ జిల్లా స్థాయి జట్ల ఎంపిక పోటీల్లో శావల్యాపురం మండలం కనమర్లపూడి సమీపంలోని సంసిద్ పాఠశాలకు చెందిన 8మంది విద్యార్థులు అత్యున్నతమైన ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఒంటేరు నాగసురేష్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు పాఠశాలల్లో బుధవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన హంసహర్షిత, లక్ష్మీశృంగేరీలు బంగారు పతకాలు సాధించగా, హర్షత్ రజత పతకాన్ని సాధించాడని, అండర్- 12, 10 విభాగాలలో భారతి, భానుప్రకాష్, షారుక్, యశ్వంత్, హర్షితలు రజత, కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. ఆగస్టు 10, 11 తేదీలలో కర్నూలులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల తరపున 8మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విద్యార్థులు బాగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుప్రఖ్యాతులు సాధించాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేశ్వర్లు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.


20వ వార్డులో జన సేన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న వినుకొండ నియోజకవర్గం కన్వీనర్ కొణిజేటి నాగశ్రీను రాయల్

20వ వార్డులో జనసేన సభ్యత్వం నమోదు ప్రారంభం

వినుకొండ, జూలై 24: జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రారంభించిన క్రియాశీల సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు బుధవారం 20వ వార్డులో ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రియాశీల సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా కొణిజేటి నాగశ్రీను రాయల్ మాట్లాడుతూ జనసేన పార్టీ సభ్యత్వం ప్రతి ఒక్కరికీ అవసరమని, ప్రతి కుటుంబానికి సభ్యత్వం పెద్ద భరోసాని అందిస్తుందని తెలిపారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సభ్యత్వం తీసుకుని ఆపదలో కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. గ్రామ, వార్డు స్థాయి, మండలస్థాయి నాయకులు కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోయి, పెద్దమొత్తంలో సభ్యత్వాలు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

శావల్యాపురానికి 25 మినీ గోకులాలు మంజూరు

శావల్యాపురం, జూలై 24: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో 25 మినీ గోకులాల నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందని పశు వైద్యాధికారులు పాలపర్తి గణేష్, సోమల గుణధీర్ బుధవారం తెలిపారు. వారు మాట్లాడుతూ అర్హతున్న రైతులు ప్రభుత్వం రాయితీపై మంజూరు చేసిన మినీ గోకులాలు నిర్మించుకొని వాటిలో గేదెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ళ పెంపకాన్ని చేపట్టవచ్చన్నారు. గేదెలు, ఆవుల కోసం నిర్మించే మినీ గోకులాలకు పెట్టుబడిలో 10శాతం రైతులు చెల్లిస్తే ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా 90శాతం చెల్లిస్తుందన్నారు. గొర్రెలు, మేకలు, కోళ్ల కోసం నిర్మించే మినీగోకులాలకు పెట్టుబడిలో 30శాతం రైతులు చెల్లిస్తే 70శాతం ప్రభుత్వం ఉపాధి హామీపథకం ద్వారా చెల్లిస్తుందన్నారు. మినీగోకులాలకు దరఖాస్తు చేసుకొనే రైతులు తమ పేరుతో 3సెంట్లు సొంత భూమిని కలిగి ఉండాలని, ఆధార్‌కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలని, పశువైద్యాధికారుల నుంచి రైతులు డిక్లరేషన్ ఫారాన్ని తీసుకోవాలన్నారు. సన్న, చిన్నకారు రైతులు దరఖాస్తు చేసుకొంటే రెవెన్యూ అధికారుల నుంచి స్మాల్‌ఫార్మర్ సర్టిఫికెట్ తీసుకోవాలన్నారు. మినీ గోకులాలు నిర్మించుకొనే రైతులు మండల, గ్రామ పంచాయతీల తీర్మానాలు రెండూ తప్పకుండా తీసుకోవాలన్నారు. రైతులు అన్ని ఆధారాలతో పశువైద్యాధికారులకు దరఖాస్తు చేసుకుంటే వారు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హత ఉన్న వారి దరఖాస్తులను ఉపాధిహామీ అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. కాబట్టి అర్హత ఉన్న రైతులు త్వరితగతిన మినీ గోకులాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

గుర్రం జాషువాకు ఘన నివాళి

53వ వర్ధంతి సందర్భంగా

జాషువా పేరుతో ఆడిటోరియం: మాజీ ఎమ్మెల్యే మక్కెన


గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పాల్గొన్న టీడీపీ నాయకులు

వినుకొండ టౌన్, జూలై 24: నవయువ కవి చక్రవర్తి గుర్రం జాషువా 53వ వర్ధంతిని పురస్కరించుకుని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు నరసరావుపేట రోడ్డులోని గుర్రం జాషువా విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పూలమాలవేసి బుధవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ జాషువా పుట్టిన గడ్డపై మనమందరం వినుకొండలో పుట్టడం ఎంతో అదృష్టమన్నారు. జాషువా ప్రపంచ కవి అని, గొప్ప సంఘ సంస్కర్త అని, అలాంటి వ్యక్తిని గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సాకారంతో ఎస్సెస్సీ కాలనీ ఆవరణలో గొప్ప ఆడిటోరియం నిర్మించి, లైబ్రరీ ఏర్పాటు చేసుకుని, ఆయన రచించిన రచనలను భావితరాలకు అందించాలని, అందించడానికి తెలుగుదేశం పార్టీ కృషి చేస్తుందన్నారు. వినుకొండ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపచేశారన్నారు. గుర్రం జాషువా విగ్రహాన్ని ఎస్సెస్సీ కాలనీలో ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది పోట్లూరి సైదారావు, నలుబోలు రామకోటేశ్వరరావు, సిద్ధయ్య, పల్లమీసాల దానయ్య, దాసరి కోటేశ్వరరావు, గర్నెపూడి ఈశ్వరయ్య, పూండ్ల నరసింహరావు, గంధం కోటేశ్వరరావు, నాగరాజు, సౌదాగర్ జానీ భాష, జాషువా సమాఖ్య అధ్యక్షుడు చిలకల జాన్‌సుందర రావు, రాంబాబు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సీపీఐ కార్యాలయంలో....

వినుకొండ టౌన్, జూలై 24: స్థానిక సీపీఐ కార్యాలయంలో కవి చక్రవర్తి, గుర్రం జాషువా 53వ వర్ధంతి కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ జాషువా కవితలతో, పద్యాలతో అణగారిన వర్గాల్లో చైతన్యం నింపారని, ఎన్నో బిరుదులు, అవార్డులతో వినుకొండ పేరు దేశ విదేశాల్లో ఇనుమడింపచేసిన గొప్పకవి అని పేర్కొన్నారు. అదేవిధంగా అబిల్ కలాం థెరీసా సేవా సొసైటీ ఆధ్వర్యంలో జాషువా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, ఆయన చేసిన సేవలను గుర్తు స్మరించుకున్నారు.

గురుకుల పాఠశాలకు భూమి కేటాయింపుపై కలెక్టర్ ఆరా

యడ్లపాడు, జూలై 24: మండలంలోని వంకాయలపాడు రెవెన్యూ బోయపాలెం గ్రామపరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలకు అవసరమైన అదనపు భవనాల నిర్మాణానికి భూమి కేటాయింపుపై జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు మండల రెవెన్యూ అధికారులను అన్ని వివరాలతో నివేదిక ఇవ్వాలని కోరినట్లు పాఠశాల పీఎంసీ చైర్మన్ బండెల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల సర్వే నం.488లో 8.50ఎకరాల విస్తీర్ణంలో నిర్మించబడిందన్నారు. వెయ్యిమంది విద్యార్థులకు ప్రవేశాలను కల్పించాల్సి ఉండగా ప్రస్తుతం 450మందికి మాత్రమే ప్రవేశాలు కల్పించడం జరిగిందన్నారు. అదనపు భవనాల నిర్మాణం జరిగితేనే పూర్తి ప్రవేశాలకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే బాలికల గురుకుల పాఠశాల, వొకేషనల్, డిగ్రీ కళాశాల కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఇటీవల కోరామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఉన్న పాఠశాలకు ఆనుకుని కొండవీడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 516, 517, 518 లలోని 16.35సెంట్ల ఏడబ్ల్యూడీ, యూఏడబ్ల్యూడీ భూమిని కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. అలాగే ఎన్‌హెచ్ 16నుంచి స్కూలు వరకు రోడ్డు నిర్మాణం కూడా చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ భూముల కేటాయింపు విషయమై అన్ని వివరాలతో సవివరమైన నివేదికను అందించాలని మండల రెవెన్యూ అధికారులను ఆదేశిస్తూ లేఖ రాశారని తెలిపారు. రెవెన్యూ అధికారులు పాఠశాల భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని సత్వరమే నివేదిక రూపొందించి కలెక్టర్‌కు సమర్పించాలని కోరారు.

బొల్లాపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విద్యాసాగర్

బొల్లాపల్లి, జూలై 24: బొల్లాపల్లి మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా విద్యాసాగర్ నియమితులయ్యారు. ప్రస్తుతం వినుకొండలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్‌ను బొల్లాపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు ఇక్కడ బాధ్యలు నిర్వహించిన రమణారావు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఎన్నికల బదిలీల్లో రమణారావు బొల్లాపల్లి తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.


వయ్యకల్లులో బోనసు పంపిణీ చేస్తున్న అధికారులు

పాడి రైతుల సంక్షేమమే లక్ష్యం

● వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ నాగప్రభు

వయ్యకల్లు (శావల్యాపురం) జూలై 24: పాడిరైతుల సంక్షేమమే లక్ష్యంగా సంగం డెయిరీ నిరంతరం కృషి చేస్తుందని వినుకొండ సంగం డెయిరీ మేనేజర్ కొత్తపల్లి నాగప్రభు అన్నారు. మండలంలోని వయ్యకల్లు గ్రామంలోని సంగం డెయిరీ వెండార్ సెంటర్‌లో బోనసుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సెంటర్‌లోని 24మంది పాలఉత్పత్తిదారులకు మొత్తం రూ.1,25,606లు బోనస్‌గా పంపిణీ చేశారు. వారిలో అత్యధికంగా దారా డేవిడ్ రూ.23,073, మర్రి కోటేశ్వరరావు రూ.13,239, దారా అంజయ్య రూ.12,546 బోనస్‌గా పొందారు. సంగం డెయిరీ డైరెక్టర్ గడిపూడి ఆంజనేయులు మాట్లాడుతూ పాలఉత్పత్తిదారులకు రాయితీలు, బోనస్‌లను అందించడమే కాక సంగం డెయిరీ ద్వారా పశువైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నార న్నారు. వయ్యకల్లులో రూ.100కి రూ.9చొప్పున బోనస్‌గా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సెంటర్ అధ్యక్షుడు గోరింట్ల పెదయోగయ్య, సూపర్‌వైజర్ రామాంజనేయులు, కో ఆర్డినేటర్ రామకోటయ్య, గ్రామస్థులు నడింపల్లి లక్ష్మయ్య, గోరింట్ల వీరవెంకటేశ్వర్లు, మర్రి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బోయపాలెం దేవాలయంలో చోరీ

బోయపాలెం (యడ్లపాడు), జూలై 24: మండలంలోని బోయపాలెం గ్రామ సమీపంలో జాతీయరహదారి పక్కనే ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో చోరీ జరిగింది. ఆలయ నిర్వాహకులు వడ్డేపల్లి నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్న సమయంలో దేవాలయం గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు ఏడు కిలోలు, 500గ్రాముల బరువైన రెండు గంటలతోపాటు స్వామి వారికి హారతి ఇచ్చే పళ్ళెంను ఎత్తుకెళ్ళినట్లు తెలిపారు. జన సంచారం ఉండగానే దుండగులు గేటు తాళాన్ని పగులగొట్టి తీసుకెళ్ళడం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. గతంలో కూడా 8 కిలోల బరువైన గంటను దొంగలు ఎత్తుకెళ్ళారన్నారు. ప్రస్తుతం చోరీకి గురైన వస్తువుల విలువ సుమారు రూ.10వేలు ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, జూలై 24: మండలంలోని కనపర్రు, గొరిజవోలు గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని వివరించారు.

30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలపై నాటక ప్రదర్శన

వినుకొండ, జూలై 24: ఈ నెల 30వ తేదీన నరసరావుపేట టౌన్ హాల్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు, ఆయన జీవిత చరిత్ర నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు హనుమంతరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో హైదరాబాద్ వారిచే ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆధార్ క్యాంపును పరిశీలించిన ఎంపీడీవో

రొంపిచర్ల, జూలై 24: మండలంలోని తురుమెళ్ళలో ఈ నెల 23వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు జరుగుతున్నాయి. బుధవారం క్యాంపును ఎంపీడీవో లక్ష్మీకుమారి పరిశీలించారు. ఆధార్ క్యాంపులను మండల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ నెల 27వ తేదీ వరకు క్యాంపులు జరుగుతాయని పేర్కొన్నారు.


తుర్లపాడులో ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాలను అందచేస్తున్న ఆరోగ్య అధికారులు

ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాల పంపిణీ

తుర్లపాడు (యడ్లపాడు), జూలై 24: ఫ్లోరైడ్ అధికంగా కలిగిన భూగర్భ జలాలను తాగడం వలన ఫ్లోరోసిస్ వ్యాధి బారిన పడతారని ఎన్‌పీపీసీఎఫ్ అధికారులు తెలిపారు. ఎన్‌పీపీసీఎఫ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సందెపూడి, తుర్లపాడు గ్రామాలలో ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాలను అధికారులు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగడం వలన కలిగే నష్టాలను, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం రెండు గ్రామాల్లోని 80మంది ఫ్లోరోసిస్ బాధితులకు నెక్ బెల్టులు, నడుము బెల్టులు, వాకర్లు, చేతికర్రలు తదితరాలను స్థానిక ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సందెపూడి గ్రామసర్పంచ్ రామకృష్ణ, తుర్లపాడు సర్పంచ్ వేణుగోపాలరావు, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రాజశేఖర్, గంగానమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సుఖవేణి, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు


రొంపిచర్ల, జూలై 24: మండలంలోని రెడ్డిపాలెం మోడల్ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రవినాయక్ మాట్లాడుతూ ఆటల వల్ల విద్యార్థుల మానసిక ఉల్లాసం పెరుగుతుందన్నారు. ఆరోగ్యవంతంగా ఉంటారని, తద్వారా చదువుల్లో రాణిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'రంగురాళ్ల కోసం కొండకు వస్తే కఠిన చర్యలు'

నకరికల్లు, జూలై 24: త్రిపురాపురం కొండ వద్దకు రంగురాళ్ల వెతుకులాట కోసం వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరికలు జారీచేశారు. బుధవారం తహసీల్దార్ ఎల్ లక్ష్మీనారాయణ, ఎస్ఐ కే నాగేంద్రరరావులు తమ సిబ్బందితో త్రిపురాపురం కొండ వద్దకు చేరుకొని అక్కడ విలువైన ఖనిజాల కోసం వెతుకుతున్న వారిని హెచ్చరించారు. రంగురాళ్ల కోసం కొండకు ఎవ్వరూ రాకూడదని బోర్డును ఏర్పాటు చేశారు. ప్రజలందరూ ఇది గమనించి జాగ్రత్త వహించాలని పోలీసు, రెవెన్యూ అధికారులు సూచనలు చేశారు.

అదనంగా వెయ్యి కొట్టు.. ఇసుక టోకెన్ పట్టు

● వైకుంఠపురం రీచ్‌లో బ్రోకర్లదే హవా


వైకుంఠపురం రీచ్‌లో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

అమరావతి, జూలై 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల సంక్షేమం కోసం అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానం అమరావతి మండలం వైకుంఠపురంలో అభాసుపాలవుతోంది. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యేలు ఇసుక జోలికి వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేసినప్పటికి కూటమికి చెందిన నాయకులు తమ బంధువులను, అనుచరులను రీచ్‌ల వద్ద ఉంచి ఇసుక లోడింగ్‌కు వాహనాలు రాకముందే వేరువేరు ఆధార్ పత్రాలతో ఇసుక బుకింగ్ చేస్తున్నారు. సంబంధిత బిల్లులు లారీ డ్రైవర్లకు ఇచ్చి అదనంగా రూ.1000 సొమ్ము చేసుకొంటున్నారు. ఈ విధంగా వెయ్యి రూపాయలు అదనంగా చెల్లించి ఇసుక కొనుగోలు చేసి గుంటూరుకు తీసుకెళ్లిన ఇసుకను రూ16వేల వరకు అమ్ముతున్నారు. 20టన్నుల ఇసుక గుంటూరుకు 12వేలకు చేర్చాల్సి ఉండగా వినియోగదారుల నుంచి వాహన యజమానులు అధికంగా వసూళ్లు చేస్తున్నారు. పైదందాతోపాటు ఇసుక రీచ్‌లో వైకుంఠపురం గ్రామానికి చెందిన కొందరు మా వాహనాలకు క్యూపద్ధతి లేకుండా లోడింగ్ చేయాలని బెదిరించడంతో పాటు అధికార పార్టీ నాయకులకు చెందిన అనుచరుల వాహనాలు కూడా సీరియల్ పాటించకుండా లోడింగ్ చేయించుకుంటున్నారు. రీచ్‌లలో తిష్టవేసిన బ్రోకర్లను అక్కడ నుంచి పంపించి ఇసుక లోడింగ్ సక్రమంగా జరిపి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

మద్యం కుంభకోణంపై విచారణ హర్షణీయం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



నరసరావుపేట టౌన్, జూలై 24: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై సీఎం చంద్రబాబు నాయుడు సీఐడీ విచారణకు ఆదేశించించటం హర్షణీయమని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యం వలన అనారోగ్యం పాలవటంతో పాటు అనేక మంది ప్రాణాలు కోల్పోయారని కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. సీఐడీ విచారణలో వైసీపీ హయాంలో మద్యం అక్రమాలకు పాల్పడిన వారి బండారం బయట పడుతుందని, మద్యం బ్రాండ్లలో జరిగిన అవినీతి అంతా ఇంతా కాదని అన్నారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ కంపెనీలకైతే అక్రమంగా దోచిపెట్టిందో, ఆ దోపిడీ సొమ్మును ఆ కంపెనీ నుంచి రికవరీ చేయాలన్నారు. టీడీపీ ప్రభుత్వంలో పేదవాళ్ళు తాగే 180ఎంఎల్ లిక్కర్ రూ.50లు, లేక రూ.70లు మాత్రమే ఉండేదని, కానీ వైసీపీ ప్రభుత్వంలో విపరీతంగా ధరలు పెంచటంతో పాటు, టీడీపీ ప్రభుత్వంలో ఉన్న 31మద్యం బ్రాండ్లు రాష్ట్రంలో లేకుండా చేసి, కేవలం రెండు బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉండేలా చేసిన జగన్‌రెడ్డికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారన్నారు.


జగ్గాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డుకి ఇరువైపులా జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలిస్తున్న డీపీవో భాస్కరరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు

పారిశుధ్యం, తాగునీటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి

● డీపీవో భాస్కరరెడ్డి

యడ్లపాడు, జూలై 24: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి పనులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనిచేయాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) భాస్కరరెడ్డి ఆదేశించారు. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు యడ్లపాడు మండల పర్యటనకు వస్తున్నారన్న సమాచారంతో డీపీవో, డీఎంహెచ్‌వో రవిలు బుధవారం యడ్లపాడుకు వచ్చారు. అయితే కలెక్టర్ రాకపోవడంతో స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో సమావేశం నిర్వహించి శాఖాపరంగా చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. రోడ్లపై చెత్త చెదారాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని, తాగునీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మురుగు కాలువల స్థితిని ఎప్పటికప్పుడు పీఆర్ 1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 15 రోజులకు ఒకసారి తాగునీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రైవేటు నీటిశుద్ధి ప్లాంట్ల యజమానులు తప్పనిసరిగా నీటి పరీక్షల ధృవపత్రాలను అధికారులకు సమర్పించాలన్నారు. అధికారులు విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అనంతరం జగ్గాపురం వెళ్లే మార్గంలో జరుగుతున్న కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శి శశికళ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళి

పత్తిలో అంతర పంట సాగుతో లాభాలు

● జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి

నాదెండ్ల, జూలై 24: పత్తిలో అంతర పంటల సాగుతో లాభాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఐ మురళి అన్నారు. మండలంలోని చిరుమామిళ్ళ గ్రామ పరిధిలో సహజ సాగు కార్యక్రమం కింద పాడి దుక్కు సేద్యం పొలాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టి నమూనాల సేకరణ, పీఎం కిసాన్ ఈకేవైసీ, మండలంలో చేపట్టిన పంటల సాగు తదితర విషయాలపై గ్రామాల వారీగా వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు. ఆయనతో పాటు ఏడీఏ మస్తానమ్మ, బీపీఎం ఏ అమలకుమారి, వ్యవసాయ అధికారి ఏ హరిప్రసాదు తదితరులు పాల్గొన్నారు.


పీహెచ్‌సీ సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్‌వో రవి

ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలి: డీఎంహెచ్‌వో రవి

యడ్లపాడు, జూలై 24: ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెరిగేలా చూడాలని పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రవి అన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ముందుగా ఓపీ రికార్డులను పరిశీలించారు. అనంతరం వైద్య ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించి డయేరియా, జ్వరపీడిత కేసులు తీసుకుంటున్న జాగ్రత్తల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రభాకరరావు, సీహెచ్‌వో పున్నారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ కే గిరిధర్ కుమార్

సురక్షితమైన నీటిని మాత్రమే తాగాలి: డాక్టర్ గిరిధర్

నాదెండ్ల, జూలై 24: సురక్షితమైన ఫ్లోరోసిస్ లేని నీటిని మాత్రమే సేవించాలని ఎన్‌పీపీసీఎఫ్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ కే గిరిధర్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొండలరాయునిపాలెంలో ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహన కల్పించి ఫ్లోరోసిస్ బాధితులకు అవసరమైన చేతి కర్రలు, నడుం, మెడ బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డీ మాలకొండయ్య, స్కూల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బీ మస్తాన్, పీ జయ తదితరులు పాల్గొన్నారు.